


Published from Jagitial
www.evarthalu.com

నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

సోమవారం MONDAY 23-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 235 Issue: 235

23 ఫిబ్రవరి 2026 - సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:42 సూర్యాస్తమయం - సా. 6:17 తిథి షష్ఠి ఉ. 9:09 వరకు తరువాత సప్తమి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం భరణి సా. 4:32 వరకు తరువాత కృతిక యోగం బ్రహ్మ ఉ. 10:10 వరకు కరణం తైతుల ఉ. 9:09 వరకు గరజ రా. 8:06 వరకు వర్జ్యం తె. 3:50 నుండి తె. 5:20 వరకు దుర్ముహూర్తం మ. 12:52 నుండి మ. 1:38 వరకు మ. 3:11 నుండి మ. 3:57 వరకు రాహుకాలం ఉ. 8:08 నుండి ఉ. 9:35 వరకు యమగండం ఉ. 11:02 నుండి మ. 12:29 వరకు గుళికాకాలం మ. 1:56 నుండి మ. 3:23 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:06 నుండి తె. 5:54 వరకు అమృత ఘడియలు మ. 12:00 నుండి మ. 1:31 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:06 నుండి మ. 12:52 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

# ఆసియా విజేత.. భారత్-ఏ

## బంగ్లాదేశ్‌పై మహిళల ఘనవిజయం.. వరుసగా రెండోసారి టైటిల్ కైవసం

ఏసీసీ మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టైటిల్‌ను భారత్ వరుసగా రెండో ఎడిషన్‌లోనూ కైవసం చేసుకుంది. బ్యాంకాక్ వేదికగా జరిగిన 2026 ఎడిషన్‌లో భారత-ఏ జట్టు విజేతగా అవతరించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో టీమిండియా 46 పరుగుల తేడాతో బంగ్లాదేశ్-ఏపై ఘన విజయం సాధించింది. ఈ టోర్నీ తొలి ఎడిషన్ (2023) ఫైనల్లోనూ భారత-ఏ జట్టు బంగ్లాదేశ్-ఏపైనే విజయం సాధించే టైటిల్‌ను చేజిక్కించుకుంది.

నేటి ఫైనల్లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా.. తేజల్ హసబ్నిస్ (51 నాటౌట్), కెప్టెన్ రాధా యాదవ్ (36) రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 134 పరుగుల చేసింది. వీరిద్దరు కాకుండా భారత ఇన్నింగ్స్‌లో బృంద దినేశ్ (19) మాత్రమే రెండంకెల స్కోర్ చేసింది. మిగతా బ్యాటర్లలో తరువాయి 2 వ పేజీలో...



# ఉగ్ర కుట్ర ఫ్లాప్

### భగ్నం చేసిన ఢిల్లీ పోలీసులు

### ఎనిమిది మంది అరెస్ట్

### తమిళనాడులో ఆరుగురు, బెంగాల్‌లో ఇద్దరు

న్యూఢిల్లీ: భారత గడ్డపై మరోసారి నెత్తురు పారించాలని చూసిన అంతర్జాతీయ ఉగ్రవాద ముఠా కుట్రను ఢిల్లీ పోలీసులు తిప్పికొట్టారు. పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ, బంగ్లాదేశ్‌కు చెందిన తీవ్రవాద సంస్థల అండదండలతో భారత్‌లో భారీ విధ్వంసానికి ప్రణాళికలు రచించిన ఎనిమిది మంది ముష్కరులను భద్రతా దళాలు అదుపులోకి తీసుకున్నాయి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఏకకాలంలో నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,928 |
| వెండి (గ్రాము): | రూ.290 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,291 |

## విశ్వవాణి



1863 తర్వాత రంజాన్, లెంట్ (క్రిస్టియన్లు ఈస్టర్ కోసం చేసే ప్రార్థన), ల్యూనార్ (చైనా) కొత్త సంవత్సరం ఒకే వారంలో రావడం ఈ ఏడాదే. మళ్లీ ఇలా 2189లోనే ఈ అరుదైన సన్నివేశం ఆవిష్కృతం కానుంది.

# దేవ్ జీ సరెండర్

## రాజిరెడ్డి, 16 మంది సభ్యులూ .. మావోయిస్టు పార్టీ భారీ దెబ్బ

మావోయిస్టు పార్టీ మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆపరేషన్ కగార్‌లో కీలక పరిణామం చోటు చేసుకుంది. మావోయిస్టు పార్టీ టాప్ కమాండర్, పార్టీ సెక్రెటరీ జనరల్ దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి సరెండర్ అయ్యారు. కేంద్ర కమిటీ సభ్యుడు రాజిరెడ్డి సహా 16మందితో కలిసి ఆయన తెలంగాణ ఎస్ఐబీ ముందు లొంగిపోయారు.



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఈవార్తలు): మార్చి 31 నాటికి నక్సలిజాన్ని అంతం చేస్తామన్న కేంద్రం.. దేవ్, రాజిరెడ్డి టార్గెట్‌గా ఇటీవల ఆపరేషన్ కగార్-2 చేపట్టింది. ఈక్రమంలోనే వారిద్దరూ తాజాగా లొంగిపోయారు. మరో రెండు రోజుల్లో మీడియా ముందు వీరిని ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది. మావోయిస్టు రహితంగా దేశాన్ని మార్చే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. కర్రెగుట్టలో ఆపరేషన్ కగార్ చేపట్టి పలువురు మావోయిస్టులను మట్టుపెట్టారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, పీఎల్జీఏ 1వ బెటాలియన్ మాస్టర్ మైండ్ మాడ్వి హిడ్మా గతేడాది నవంబర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. ఆంధ్రప్రదేశ్-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఇటీవల మావోయిస్టు పార్టీలో కీలక నేతగా ఉన్న పాక హనుమంతు సైతం ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. సుదీర్ఘ కాలం పాటు అండర్‌గ్రౌండ్‌లో ఉన్న బర్సే దేవా మరికొందరు కీలక మావోయిస్టులు కూడా హింసా మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. కొద్ది నెలల క్రితం 200 మందికి పైగా మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ సీఎం, హోం మంత్రి ముందు లొంగిపోయారు. వీరిలో 98 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. కేంద్ర కమిటీ సభ్యుడు తరువాయి 2 వ పేజీలో...



# పాస్‌వర్డ్స్ మార్చండి

## కేవైసీ అప్‌డేట్ చేసుకోండి.. సైబర్ మోసాల బారిన పడొద్దు

### దేశ ప్రజలకు మోదీ పిలుపు.. 131వ మన్ కీ బాత్‌లో ప్రసంగం

బ్యాంకు ఖాతాల పాస్‌వర్డ్‌లను తరుచుగా మారుస్తుండాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ సూచించారు. నో యువర్ కస్టమర్ (కేవైసీ)ని అప్‌డేట్ చేయమని, రీ-కేవైసీని చేయమని బ్యాంకు నుంచి వచ్చే రిక్వెస్టులను చూసి అస్సలు చిరాకు పడొద్దని ప్రజలను ఆయన కోరారు. సొంత డబ్బును కాపాడుకునేందుకే ఈ పనిని చేస్తున్నామనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు.

న్యూఢిల్లీ: ఆదివారం రోజు 131వ మన్ కీ బాత్ కార్యక్రమంలో మోదీ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఇప్పటికే బ్యాంకు ఖాతా కేవైసీని చేశాం కదా, దీన్ని మళ్లీమళ్లీ ఎందుకు చేయాలనే ప్రశ్న చాలామంది మదిలో ఉదయిస్తుంటుందని ప్రధాని అన్నారు. మళ్లీమళ్లీ కేవైసీ ఎందుకంటే, బ్యాంకు ఖాతా భద్రత కోసమే అని అందరూ గ్రహించాలని ఆయన పిలుపునిచ్చారు. డిజిటల్ అరెస్ట్ లాంటి ఆన్‌లైన్ ఆర్థిక మోసాల బారినపడకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రజలకు సూచించారు. ఈ కాలంలో పెన్షన్, రాయితీలు, బీమా, యూపీఐ సహా అన్నీ బ్యాంకు ఖాతాతోనే లింకై ఉన్నాయని మోదీ గుర్తు చేశారు. అందుకే ఖాతాలకు మెరుగైన భద్రతను కల్పించేందుకు రీ కేవైసీని బ్యాంకులు చేయిస్తాయన్నారు. 'అయితే కేవైసీ, రీ కేవైసీ పేరుతో కొంతమంది తరువాయి 2 వ పేజీలో...



# ప్రాజెక్టులను కేసీఆర్ పట్టించుకోలే!

## దేవాదులపై బీఆర్ఎస్ చిన్నచూపు

### అందుకే నీళ్ల సమస్యలు వస్తున్నాయ్.. సీఎం ఆరోపణలు

ములుగు జిల్లాలోని తుపాకులగూడెం వద్ద ఉన్న దేవాదుల ఎత్తిపోత ప్రాజెక్ట్‌ను ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గోదావరి జల వివాదం రాజకీయరంగు పులుముకుందని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే వివాదమే ఉండేది కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

ములుగు, ఫిబ్రవరి 22 (ఈవార్తలు): తెలంగాణలో 960 టీఎంసీల జలాలకు సరిపడా ప్రాజెక్టులు నిర్మించి ఉంటే ఈ సమస్య ఎదురయ్యేది కాదని అన్నారు. ఇకనైనా ప్రాజెక్టులను పూర్తి చేసి.. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఒక్క కాళేశ్వరం తరువాయి 2 వ పేజీలో...



# ఢిల్లీకి రేవంత్ సంచులు

## స్వయంగా సీఎం ఒప్పుకున్నడు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఏఐసీసీకి ఏటీఎంగా మార్చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గత రెండేళ్లుగా తాము చెబుతున్న విషయాన్నే ఇప్పుడు సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిస్సిగ్గుగా ఒప్పుకున్నారని ఆయన విమర్శించారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఈవార్తలు): రైతులకు, మహిళలకు, యువతకు ఇచ్చిన 420 హామీల అమలుకు నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం, మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇళ్లను, లగచర్లలో గిరిజనుల భూములను, చివరకు విశ్వవిద్యాలయాల భూములను కూడా వదలడం లేదని ఆరోపించారు. అనుముల బ్రదర్స్ కలిసి తెలంగాణ భూములను అప్పనంగా దోచుకుంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కేవలం రెండేళ్లలోనే ఈ ప్రభుత్వం మూడు లక్షల కోట్ల రూపాయల అప్పు తెచ్చిందని, కానీ రాష్ట్రంలో ఒక్క తరువాయి 2 వ పేజీలో...

# పుష్ప.. అక్కడ!

## ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్

### ఉత్తమ దర్శకుడిగా సుకుమార్... ఉత్తమ చిత్రంగా పుష్ప-2 ది రూల్

పుష్ప 2 చిత్రం తర్వాత ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రేంజ్ నిజంగా నెక్స్ట్ లెవల్‌కు చేరిందనే చెప్పాలి. ఈ సినిమా సృష్టించిన సంచలనం గురించి ఎంత చెప్పినా తక్కువే. మాస్, యాక్షన్, ఎమోషన్ ప్రతి అంశంలోనూ తన పీక్ పెర్ఫార్మెన్స్ చూపించిన అల్లు అర్జున్, బాక్సాఫీస్ వద్ద రూ.1300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సరికొత్త రికార్డులు నెలకొల్పారు.

ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రకు గాను అల్లు అర్జున్ తాజాగా మరోసారి ఫిల్మ్‌ఫేర్ అవార్డును అందుకున్నారు. బెస్ట్ యాక్టర్‌గా ఈ గౌరవం అందుకోవడం ద్వారా ఆయన కెరీర్‌లో మొత్తం 7 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు పూర్తయ్యాయి. యంగ్ తరువాయి 2 వ పేజీలో...






# టీజీఎస్పీడీసీఎల్ వాట్సాప్ సేవలు షురూ

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఈవార్తలు): దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ తన వినియోగదారులకు మరింత సమర్థవంతమైన, సులభమైన సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. ఈ దిశగా వినియోగదారులు విద్యుత్ సేవలను నేరుగా తమ మొబైల్ ఫోన్ తరువాయి 2 వ పేజీలో...



2

# రేవంత్ అడుగులు భూకబ్జాలు

### మెగా కృష్ణారెడ్డికి భూములు కట్టబెట్టే కుట్ర

### పేదలకు ఇచ్చేందుకు డబ్బులు లేకపోతే..

### వందల కోట్లతో క్యాంప్ ఆఫీసులెందుకు?

### సీఎం రేవంత్‌పై హరీశ్ రావు ధ్వజం

## రాశి ఫలాలు

23.2.2026

మేషం: వృత్తి, వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకపోవడం మంచిది. దైవదర్శనాలు చేసుకుంటారు. ముఖ్యమైన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. ఆదాయానికి మించిన ఖర్చులు ఉంటాయి. బంధువులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. ఉద్యోగమున కొందరి ప్రవర్తన మానసిక చికాకు కలిగిస్తాయి.

వృషభం: నూతన వ్యాపారాలు ప్రారంభించి లాభాలు అందుకుంటారు. దూర ప్రాంత మిత్రుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో విశేషంగా రాణిస్తారు. సమాజంలో గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. అన్ని వైపుల నుండి ఆదాయం పొందుతారు. నిరుద్యోగులకు ఉద్యోగ లాభం ఉన్నది.

మిథునం: చేపట్టిన వ్యవహారాలలో అప్రయత్నంగా విజయం సాధిస్తారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలలో అవరోధాలు తొలగుతాయి. కుటుంబ సభ్యులతో విందువినోదాలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. వాహన వ్యాపారస్తులకు అనుకూలత పెరుగుతుంది.

కర్కాటకం: ధనపరంగా కొంత గందరగోళ పరిస్థితులుంటాయి. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. సోదరులతో వివాదాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగమున అధికారుల నుండి విమర్శలు తప్పవు. నిరుద్యోగుల ప్రయత్నాలు నిరుత్సాహం కలిగిస్తాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గోనడం మంచిది.

సింహం: చేపట్టిన పనులు సకాలంలో పూర్తికాక చికాకు కలిగిస్తాయి. వృత్తి వ్యాపారాలలో భాగస్తులతో ఊహించని ఇబ్బందులు ఎదురవుతాయి. దూర ప్రయాణాలలో శ్రమాధిక్యత కలుగుతుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఉద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. విద్యార్థుల పరీక్షా ఫలితాలు నిరాశ కలిగిస్తాయి. ఆర్థికంగా స్థిరత్వం ఉండదు.

కన్య: కుటుంబ సభ్యులతో దైవ సేవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. నూతన వ్యాపార ప్రారంభానికి అవరోధాలు అధిగమిస్తారు. నూతన విద్య ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. పాత మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగాలలో అప్పగించిన భాద్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఆర్థిక పురోగతి కలుగుతుంది.

తుల: ముఖ్యమైన వ్యవహారాలలో ఆకస్మిక విజయం సాదిస్తారు. కుటుంబ సభ్యుల సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. నిరుద్యోగుల యత్నాలు అనుకూలిస్తాయి. భూ సంభందిత క్రయవిక్రయాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు. వృత్తి వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి.

వృశ్చికం: ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. చేపట్టిన పనులలో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. కుటుంబ సభ్యులు ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ధన పరమైన విషయాలలో తొందరపడి ఇతరులకు మాట ఇవ్వడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలలో సమస్యాత్మక వాతావరణం ఉంటుంది.

ధనస్సు: ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. అకారణంగా సన్నిహితులతో వివాదాలు కలుగుతాయి. కీలక వ్యవహారాలలో స్వంత ఆలోచనలు కలసిరావు. కుటుంబమున కొందరి మాటల వలన మానసిక చికాకులు కలుగుతాయి. నిరుద్యోగులు అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు. ఉద్యోగ వాతావరణం నిరుత్సాహంగా ఉంటుంది.

మకరం: బంధు మిత్రులతో సంతోషంగా గడుపుతారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ముఖ్యమైన వ్యవహారాలు అనుకూలంగా సాగుతాయి. నూతన వాహన భూ లాభాలు పొందుతారు. వృత్తి, వ్యాపారాలలో నూతన పెట్టుబడులు పెట్టి లాభాలు అందుకుంటారు.

కుంభం: కుటుంబ సభ్యులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనుల్లో ప్రతిష్టంభనలు తప్పవు. దూర ప్రయాణాలలో శ్రమాధిక్యత కలుగుతుంది. ఆరోగ్య విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.

మీనం: స్థిరాస్తి వివాదాలు పరిష్కారం అవుతాయి. సంతాన శుభకార్యాలకు ధనం ఖర్చు చేస్తారు. సమాజంలో పెద్దల నుండి ప్రశంసలు అందుకుంటారు. అనుకున్న పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. చుట్టుపక్కల వారితో సఖ్యతగా వ్యవహరిస్తారు. వృత్తి ఉద్యోగాలలో అధికారుల ఆదరణ పెరుగుతుంది. వ్యాపారాలలో సమస్యలు సర్దుమణుగుతాయి.

# ప్రాజెక్టులను కేసీఆర్ పట్టించుకోలే!

**మొదటి పేజీ తరువాయి**

ప్రాజెక్టు కోసమే రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేశారని, మిగతా వాటిని పట్టించుకోలేదని, ప్రస్తుతం మిగతా ప్రాజెక్టుల నిర్మాణం, భూ సమీకరణకు నిధుల కొరత తీవ్రంగా ఉందని అన్నారు మేడిగడ్డ బ్యారేజీ కుంగి తర్వాత కాళేశ్వరం నుంచి చుక్క నీరు ఎత్తిపోయక పోయినా. అత్యధికంగా వరి దిగుబడి వచ్చిందని తెలిపారు. కేసీఆర్, హరీశ్‌రావు తప్పులు చేశారని గ్రహించిన ప్రజలు సరైన తీర్పు ఇచ్చారని రేవంత్ వ్యాఖ్యానించారు. వాళ్లు పదేళ్లలో ఏం చేశారో, తమ ప్రభుత్వం ఏం చేసిందో సభలో చర్చిద్దామని, అనుభవంతో వారు సూచనలు చేస్తే స్వీకరిస్తామని చెప్పారు. ఇదే సమయంలో జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నట్టు చేస్తున్న ఆరోపణలు పూర్తి అసంబద్ధమని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని, ప్రజలు, నీళ్ల విషయంలో కాదన్నారు. అనేక ఎన్నికల్లో ప్రజల తిరస్కరించినా బీఆర్ఎస్‌కు బుద్ధి రాలేదని, మళ్లీ వాళ్లను గెలిపించకపోవడం ప్రజల తప్పన్నట్లు వ్యవహరిస్తున్నారని రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు. ప్రజలను తప్పుపట్టడం మాని, ఆ పార్టీ నాయకులు విజ్ఞతగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యమంత్రి పీఠం ప్రతీసారి వారసత్వంగా దక్కదని ఎద్దేవా చేశారు. టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు వరుసగా రెండుసార్లు చొప్పున ప్రజలు అవకాశమిచ్చారని, ప్రస్తుత తమ ప్రభుత్వానికి కూడా ఇంకో అవకాశం ఇస్తారని రేవంత్ రెడ్డి . జోస్యం చెప్పారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలను అలాగే వదిలేయమని, ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులను వృథాగా వదిలేసేది లేదని తేల్చిచెప్పారు. నిపుణుల సూచనల ప్రకారం మరమ్మతులు చేసి.. వినియోగంలోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. ప్రతిపక్ష శాసనసభకు వచ్చి గోదావరి జలాలపై సూచనలు చేస్తే తప్పకుండా స్వీకరిస్తామని సీఎం పునరుద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్‌లో జల వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకునే దిశలో ఉన్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై దేవాదుల ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది . ఈ పనుల పురోగతిని పరిశీలించేందుకు వెళ్లిన సీఎం.. అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎం వెంట మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, స్థానిక ఎమ్మెల్యేలు ఉన్నారు.

# ఉగ్ర కుట్ర ఫ్లాప్

**మొదటి పేజీ తరువాయి**

ఆరుగురిని తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లాలో, మరో ఇద్దరిని పశ్చిమ బెంగాల్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులకు పట్టుబడిన వారిలో కొందరు బంగ్లాదేశీయులు ఉన్నారని, వీరంతా నకిలీ ఆధార్ కార్డులతో తమ స్వస్థలాలను దాచిపెట్టి, దేశంలో చొరబడినట్లు దర్యాప్తులో తేలింది. ముఖ్యంగా తమిళనాడులోని గార్మెంట్ తయారీ యూనిట్లలో కార్మికులుగా చలామణి అవుతూ, వీరు రహస్యంగా ఉగ్ర కార్యకలాపాలను సాగిస్తున్నట్లు ప్రత్యేక విభాగం అధికారులు గుర్తించారు. ఈ భారీ కుట్ర వెనుక విదేశాల్లో తలదాచుకున్న హ్యాండ్లర్ల హస్తం ఉన్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. కశ్మీర్‌కు చెందిన ఓ వ్యక్తి ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉంటూ ఈ ఎనిమిది మందిని భారత్‌లో ఆపరేట్ చేస్తున్నట్లు భద్రతా సంస్థలు నిర్ధారించాయి. నిందితుల నుంచి ఎనిమిది మొబైల్ ఫోన్లు, పదహారు సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్న పోలీసులు, వాటిలోని డిజిటల్ డేటాను విశ్లేషిస్తున్నారు. ఢిల్లీలోని అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాలు, చారిత్రక కట్టడాలే లక్ష్యంగా లష్కరే తొయిబా ఉగ్రవాదులు ఐఈడీ దాడులకు ప్లాన్ చేస్తున్నారన్న నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో ఈ అరెస్టులు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ముఖ్యంగా పాత ఢిల్లీలోని చాంద్‌నీ చౌక్ ప్రాంతంలోని ఓ దేవాలయంతో పాటు ఎర్రకోట పరిసరాల్లో మారణహోమం సృష్టించేందుకు వీరు వ్యూహరచన చేసినట్లు సమాచారం. ఢిల్లీ మెట్రో సహా సుమారు పదికి పైగా ప్రాంతాల్లో 'ఫ్రీ కాశ్మీర్' నినాదాలతో కూడిన రెచ్చగొట్టే పోస్టర్లను ఈ ముఠా అంటించింది. ఈ పోస్టర్ల మూలాలపై దర్యాప్తు చేసిన ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ అధికారులకు తమిళనాడు కేంద్రంగా సాగుతున్న ఈ నెట్‌వర్క్ చిరునామా చిక్కింది.

# దేవ్ జీ సరెండర్

**మొదటి పేజీ తరువాయి**

తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న మాడ్ డివిజన్ కార్యదర్శి రనిత కూడా లొంగిపోయారు. మహారాష్ట్ర సీఎం ఎదుట కూడా వందల సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో తెలంగాణకు చెందిన 15 మంది ఉన్నారు. వీరిలో కేంద్ర కమిటీలో ఇద్దరు, రాష్ట్ర కమిటీలో ఐదుగురు, డివిజన్ కమిటీలో ఆరుగురు, అండర్‌గ్రౌండ్‌లో ఒకరితో పాటు మరొకరు ఉద్యమంలో కొనసాగుతున్నట్లు ఇటీవల డీజీపీ వెల్లడించారు.




# ఆసియా విజేత.. భారత్-ఏ

**మొదటి పేజీ తరువాయి**

నందిని కశ్యప్ 8, అనుష్క శర్మ 8, తనూజా కన్వర్ 1, ప్రేమా రావత్ 4, మిన్నూ మణి డకౌటయ్యారు. మమత మడివాలా 2 పరుగులతో అజేయంగా నిలిచింది. బంగ్లా బౌలర్ ఫాహిమ ఖాతూన్ (4-0-25-4) అద్భుతంగా బౌలింగ్ చేసి భారత్‌ను కట్టడి చేసింది. మరో బౌలర్ ఫాతిమా జహా సోనియా (4-0-19-1) పొదుపుగా బౌలింగ్ చేసింది. ఫర్జానా ఎస్మిన్ (4-0-30-1) పర్వాలేదనిపించింది. మిగతా బౌలర్లలో సంజిద అక్తర్ 3 ఓవర్లలో 12 పరుగులు.. ఫరీహా త్రిస్న 3 ఓవర్లలో 23 ప రుగులు.. లతా మొండల్, సదియా అక్తర్ తలో ఓవర్ వేసి 14, 9 పరుగులిచ్చారు. అనంతరం 135 పరుగుల లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్-ఏ జట్టు తడబడింది. భారత బౌలర్లు ప్రేమా రావత్ (4-0-12-3), తనూజా కన్వర్ (3.1-0-11-2), సోనియా మెంధియా (4-0-21-2), కెప్టెన్ రాధా యాదవ్ (4-0-16-1), సైమా ఠాకోర్ (2-0-11-1), మిన్నూ మణి (2-0-17-1) ధాటికి 19.1 ఓవర్లలో 88 పరుగులకే ఆలౌటై పరాజయంపాలైంది. బంగ్లా ఇన్నింగ్స్‌లో 20 పరుగులు చేసిన షమీమా సుల్తానా టాప్ స్కోరర్‌గా నిలిచింది. సర్మిన్ సుల్తానా (18), కెప్టెన్ ఫాతిమా ఖాతూన్ (14), సది యా అక్తర్ (10) అతికష్టం మీద రెండంకెల స్కోర్లు చేశారు. ప్రేమా రావత్ 3 వికెట్లు తీయడంతో పాటు 3 క్యాచ్‌లు పట్టి భారత గెలుపులో కీలకపాత్ర పోషించింది.

# రేవంత్ అడుగులు భూకబ్జాలు

**మెగా కృష్ణారెడ్డికి భూములు కట్టబెట్టే కుట్ర**

**పేదలకు ఇచ్చేందుకు డబ్బులు లేకపోతే..**

**వందల కోట్లతో క్యాంప్ ఆఫీసులెందుకు?**

**సీఎం రేవంత్‌పై హరీశ్ రావు ధ్వజం**



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (ఈవార్తలు): మూసీ సుందరీకరణ పేరిట రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ దోపిడీకి పాల్పడుతున్నాడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. ముఖ్యమంత్రి వేసే ప్రతి అడుగు వెనుక భూ కబ్జాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారమే అని అన్నారు. పేదల ఇండ్లు కూల్చి, మెగా కృష్ణారెడ్డికి భూములు కట్టబెట్టే కుట్ర జరుగుతుందని మండిపడ్డారు. పేదలకు డబ్బులు లేవని చెప్పే ముఖ్యమంత్రికి.. వందల కోట్లతో క్యాంపు ఆఫీసులకు పైసలు ఎక్కడివని ప్రశ్నించారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పేరుతో ఇండ్లు కోల్పోతున్న మధు పార్క్ అపార్ట్‌మెంట్ బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇంఛార్జి కార్తీక్ రెడ్డి తదితరులు కలిసి పరామర్శించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు ఇక్కడికి వచ్చినట్లు తెలిపిన హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేసీఆర్‌కు మధు పార్క్ అపార్ట్‌మెంట్‌తో మర్చిపోలేని అనుబంధం ఉందని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ ఈ అపార్ట్‌మెంట్‌కు మూడుసార్లు వచ్చారని.. టీఆర్ఎస్ పార్టీ పాలసీ విజన్ డాక్యుమెంట్‌ను ఇక్కడి వార్ రూముల్లో కూర్చునే తయారు చేశారని గుర్తుచేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక.. ఇక్కడ మంచినీళ్లు లేక మీరు అపార్ట్‌మెంట్ ఖాళీ చేసి వెళ్లిపోతామంటే, అప్పటికప్పుడు హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించి ప్రత్యేక పైపులైన్ వేశారని తెలిపారు. అప్పటి హోంమంత్రి నాయిని నరసింహారెడ్డితో బటన్ ఆన్ చేయించి మరీ మీకు నీళ్లు ఇచ్చారన్నారు. సబితక్కకు మీరు ఒక్క ఫోన్ చేస్తే రాత్రికి రాత్రే మీ ముందు రోడ్డు వేయించారని పేర్కొన్నారు. నాడు మూసీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న సుధీర్ రెడ్డి మూసీని క్లీన్ చేయించి మీకు దోమల బెడద లేకుండా చేశారన్నారు. కేసీఆర్ ఎప్పుడూ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ఎలా పెంచాలి, ప్రజలకు ఎలా మేలు చేయాలి అని ఆలోచించారని తెలిపారు. ఈ అపార్ట్‌మెంట్‌ను నిలబెట్టే ప్రయత్నం కేసీఆర్ చేస్తే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం జేసీబీలతో దీన్ని కూల్చే ప్రయత్నం చేస్తున్నాడని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మూసీ ప్రక్షాళనపై కనీస పాలసీ, ఒక విధానం లేదని.. పూటకో తీరుగా వ్యవహరిస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. మూసీని శుద్ధి చేయాలని అందరూ కోరుకుంటారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా అప్పట్లోనే రూ. 3800 కోట్లతో ఎస్టీపీలను నిర్మించి ఆ పని ప్రారంభించిందని తెలిపారు. కాళేశ్వరం నుంచి గోదావరి నీళ్లు తెచ్చి మూసీలోకి వదిలేందుకు డీపీఆర్‌లను కూడా కేసీఆర్ ప్రభుత్వం తయారు చేయించిందని తెలిపారు. అప్పుడు మా ప్రభుత్వానికి ఏ ఒక్క ఇల్లూ కూల్చే ఆలోచన రాలేదని చెప్పారు. అసలు రేవంత్ రెడ్డి ఏం చేసినా దాని వెనుక కచ్చితంగా రియల్ ఎస్టేట్ వ్యాపారమే ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రిగా ఆయన వేసే ప్రతి అడుగులో భూముల పంచాయతీలు, రియల్ ఎస్టేట్ దోపిడీ దాగి ఉంటుందని విమర్శించారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములు గుంజుకుందామని ప్రయత్నం చేస్తే సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందని గుర్తుచేశారు. ఎల్టీపీఎస్ భూములను కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని ఆలోచన చేశాడని హరీశ్‌రావు తెలిపారు. ఫార్మాసిటీ కోసం కేసీఆర్ 14,000 ఎకరాలు సేకరిస్తే.. దాన్ని ఫోర్త్ సిటీ అని పేరు మార్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడని మండిపడ్డారు. ఇప్పుడు మూసీ సుందరీకరణ పేరిట మీ ఇండ్లు కూల్చి, మీ భూములు లాక్కొని.. వాటిని అంబానీకో, అదానీకో, మెగా కృష్ణారెడ్డికో కట్టబెట్టాలని రేవంత్ రెడ్డి చూస్తున్నాడని అన్నారు. మేం మీ జేబులు నింపుకోవడానికి చేసే ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి పూర్తిగా వ్యతిరేకమని తెలిపారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక హైదరాబాద్‌లో కట్టిన ఇల్లు ఒక్కటీ లేదని విమర్శించారు. కూల్చిన బతుకులు, కూల్చిన ఇండ్లు తప్ప మరేమీ లేవని అన్నారు.

# ఢిల్లీకి రేవంత్ సంచులు

**మొదటి పేజీ తరువాయి**

కొత్త నిర్మాణం కూడా చేపట్టలేదని కేటీఆర్ విమర్శించారు. దండుపాళ్యం ముఠా తరహాలో తెలంగాణ సంపదను దోచుకుంటూ, సొంతానికి దాచుకుంటూ రేవంత్ సర్కార్ కాలం గడుపుతోందని ధ్వజమెత్తారు. తన ముఖ్యమంత్రి పదవిని కాపాడుకోవడం కోసమే రేవంత్ రెడ్డి ఢిల్లీకి నిరంతరం డబ్బు సంచులు మోస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి, రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీకి నిధుల గనిగా మార్చిన తీరుపై కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

# ..వాట్సాప్ సేవలు షురూ

**మొదటి పేజీ తరువాయి**

ద్వారానే పొందేలా వాట్సాప్ చాట్‌బాట్ సేవలను ప్రారంభించినట్లు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ వాట్సాప్‌లో 8712441912 నంబర్‌ను సేవ్ చేసుకుని 'హాయ్' అని మెసేజ్ పంపడం ద్వారా ఫిర్యాదుల నమోదు, బిల్లింగ్ వివరాలు, విద్యుత్ సరఫరా స్థితి సమాచారం వంటి వివిధ సేవలను సులభంగా పొందవచ్చు. ఈ సేవ ద్వారా వినియోగదారులు ఎప్పుడైనా, ఎక్కడైనా విద్యుత్‌కు సంబంధించిన సమాచారాన్ని వేగంగా పొందగలుగుతారు. ప్రతి వినియోగదారుడు ఈ నంబర్‌ను తమ మొబైల్ ఫోన్‌లో సేవ్ చేసుకోవడం ద్వారా విద్యుత్ సేవలను మరింత సులభంగా, సురక్షింతంగా వినియోగించుకోవచ్చని సంస్థ పేర్కొంది.

# పుష్ప.. అక్కడ!

**మొదటి పేజీ తరువాయి**

హీరోల్లో ఇన్ని ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్న నటుడిగా బన్నీ టాప్‌లో నిలవడం విశేషం. ఇక ఫిల్మ్‌ఫేర్ అవార్డుల సంఖ్యలో మెగాస్టార్ చిరంజీవికి అల్లు అర్జున్ సమానమయ్యాడు. చిరంజీవి తన కెరీర్‌లో 7 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకోగా, ఇప్పుడు 'పుష్ప 2'తో వచ్చిన ఈ అవార్డుతో బన్నీ కూడా అదే స్థాయికి చేరుకున్నారు. తక్కువ సినిమాలతో ఈ ఫీట్ సాధించడం విశేషమని సినీ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. మెగాస్టార్ చిరంజీవి లైఫ్ టైమ్ అచీవ్ మెంట్, స్పెషల్ లెజెండ్ అవార్డుతో కలుపుకొని 9 ఫిలిం ఫేర్ అవార్డులు ఉన్న హీరోగా నిలిచారు. కాగా, గతంలో 'పరుగు', 'రేసు గుర్రం' (క్రిటిక్స్), 'రుద్రమదేవి' (బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్), 'సరైనోడు', 'పుష్ప: ది రైజ్' సినిమాలకు గానూ అల్లు అర్జున్ ఫిలిం ఫేర్స్ అందుకున్నాడు.

# పాస్‌వర్డ్స్ మార్చండి


**మొదటి పేజీ తరువాయి**

నేరగాళ్ల నుంచి ఫేక్ కాల్స్ వచ్చే ప్రమాదం ఉంది. వాళ్లు ఎస్ఎంఎస్‌లు, వెబ్ సైట్ లింక్స్ పంపే ముప్పు కూడా ఉంది. అందుకే కేవైసీ, రీ కేవైసీని నేరుగా బ్యాంకు బ్రాంచీలో చేయించండి. లేదంటే బ్యాంకు అధికారిక యాప్ ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేయండి. ఎవరికీ మీ ఓటీపీని, ఆధార్ నంబరును, బ్యాంకు ఖాతా వివరాలను చెప్పకండి. మీ బ్యాంకు ఖాతా పాస్‌వర్డ్‌లను తరుచుగా మారుస్తుండండి. ఇలాంటి అంశాలపై దేశ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇటీవలే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలను నిర్వహించింది. ఈ ఏడాది పొడవునా ఈ వారోత్సవాలు కొనసాగనున్నాయి. ఆర్‌బీఐ సూచనలను పాటించండి. మీ కేవైసీని అప్‌డేట్ చేసుకోండి' అని ప్రధాని మోదీ తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఏఐ సదస్సు ద్వారా ఏఐ విభాగంలో భారత్ అద్భుత సామర్థ్యాలేంటో ప్రపంచానికి తెలిసొచ్చాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఏఐ సదస్సు వేళ మూడు మేడిన్ ఇండియా ఏఐ మోడల్స్‌ను భారత్ ఆవిష్కరించిందని ఆయన తెలిపారు. ఈ జాబితాలో సర్వం ఏఐకు చెందిన లార్జ్ ల్యాంగ్వేజ్ మోడల్, జ్ఞాని.ఏఐకు చెందిన వచన టెక్ట్స్ టు స్పీచ్ మోడల్, భారత్ జెన్స్‌కు చెందిన పరం2 17బీ బహుభాషా ఫౌండేషనల్ మోడల్ ఉన్నాయని చెప్పారు. వివిధ ప్రపంచ దేశాల నేతలు, పరిశ్రమ నిపుణులు, ఆవిష్కర్తలు, స్టార్టప్‌ల ప్రతినిధులను ఏఐ సదస్సు వేదికపైకి తేవడంలో భారత్ సక్సెస్ అయిందని ప్రధాని అన్నారు. ఆ సదస్సు సందర్భంగా పలువురు ప్రపంచ దేశాల నేతలు, టెక్ దిగ్గజ కంపెనీల సీఈఓలతో తాను కూడా భేటీ అయ్యానని ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఏఐ శక్తిని ప్రపంచం ఎలా వినియోగిస్తుందనే దిశగా జరుగుతున్న కసరత్తులో ఈ ఏఐ సదస్సు ఒక టర్నింగ్ పాయింట్ లాంటిదన్నారు. 'భారత్ నిర్వహించిన ఏఐ సదస్సుకు చాలామంది ప్రపంచదేశాల నేతలు వచ్చారు. ఈ సదస్సు సందర్భంగా ప్రదర్శించిన భారతీయ ఏఐ ఆవిష్కరణలను నేను వాళ్లకు చూపించాను. ప్రపంచ దేశాల నేతలకు ప్రత్యేకించి రెండు ఆవిష్కరణలు బాగా నచ్చాయి. వీటిలో మొదటిది అమూల్ బూత్. ఇందులో పశువుల నిర్వహణతో ముడిపడిన ఏఐ యాప్‌లను ప్రదర్శించారు. సకాలంలో పశువులకు చికిత్సను అందించేందుకు ఏఐ టెక్నాలజీని ఎలా వినియోగించాలి అనేది అమూల్ బూత్‌లో వివరించారు. పాల డైరీ కార్యకలాపాలను, పశువులను ఎప్పటికప్పుడు సమర్థంగా ట్రాక్ చేసేందుకు పాడి రైతులకు ఏఐ వ్యవస్థలు ఎలా ఉపయోగపడతాయి అనే సమాచారాన్ని ఆ బూత్‌లో తెలియజేశారు' అని వివరించారు. 'ఇక ప్రపంచ దేశాల నేతలకు నచ్చిన రెండో ఆవిష్కరణ భారత సంస్కృతి పరిరక్షణతో ముడిపడినది. ఏఐ టెక్నాలజీతో అత్యంత ప్రాచీన సుశ్రుత సంహిత గ్రంథానికి చెందిన తాళపత్రాల ఫొటోలను హైక్వాలిటీలో చూపించారు. తాళపత్రాలనూ చాలా ఈజీగా చదివే ఏర్పాటును ఏఐ టెక్నాలజీ చేసింది. సుశ్రుత సంహిత తాళపత్రాల ఫొటోలను మెషీన్ రీడబుల్ ఫార్మాట్‌లోకి మార్చారు. ఒక ఏఐ అవతార్‌ను క్రియేట్ చేసి, దాని ద్వారా తాళపత్రాలలోని ప్రాచీన లిపిని భారతీయ భాషల్లోకి, విదేశీ భాషల్లోకి అనువదించారు. ఇదంతా చూసి ప్రపంచ దేశాల నేతలు ఆశ్చర్యపోయారు. ఏఐ టెక్నాలజీ చలువతో భారతదేశ ప్రాచీన విజ్ఞానాన్ని నేర్చుకునే అవకాశం తమకూ లభిస్తుందని వాళ్లు చెప్పారు. ఏఐ టెక్నాలజీతో మనం ప్రాచీన పురాణాలు, ఇతిహాసాలు, సంప్రదాయ విజ్ఞానం, తాళపత్ర గ్రంథాలు, చేతిరాత ప్రతులను పరిరక్షించొచ్చు. ఈతరం ప్రజలు చదివేందుకు అనుగుణంగా వాటిని మార్చొచ్చు' మోదీ తెలిపారు. 'ఫిబ్రవరి 24న తమిళనాడు మాజీ సీఎం జయలలిత జయంతి జరగబోతోంది. ఆమెకు ఈసందర్భంగా నివాళులు అర్పిస్తున్నాను. అమ్మ జయలలిత తమిళనాడు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. కేరళకు చెందిన మామాంగం సంప్రదాయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. 250 ఏళ్ల తర్వాత మళ్లీ ఆ సంప్రదాయం కేరళలో జీవం పోసుకుంది. ఇది హర్షించే విషయం' అని చెప్పారు. ఇక, 'అమెరికా, కెనడా, ఒమన్ సహా ఎన్నో దేశాల్లో భారత సంతతి క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. టీ2 వరల్డ్ కప్‌లో ఈవిషయం స్పష్టంగా కనిపించింది.



జల్,జంగల్, జమీన్ పేరుతో సాగిన మావోయిస్టుల సాయుధ పోరాటం ఇక ముగిసినట్లేనా? దేశంలో ఇక మీదట అడవుల్లో అన్నల కార్యకలపాలు కనిపించవా? ఆరు దశాబ్దాలుగా కొనసాగిన మావోయిస్టు ఉద్యమం చివరిదశకు చేరిందా? అంటే ప్రస్తుత పరిణామాలు అవుననే చెప్తున్నాయి. ఇప్పటికే అనేకమంది అగ్రనేతలు ఎన్ కౌంటర్లలో మృతి చెందగా కేంద్ర కమిటీలో కీలకంగా ఉన్న నేతలు పలువురు ఇటీవల లొంగుబాట పట్టడంతో మావోయిస్టు ఉద్యమం ఇక ముగిసిన గతమేనన్న సంకేతాలు ఇస్తోంది.

ఒకవైపు “2026 మార్చి31 నాటికి నక్సల్ ఉద్యమాన్ని లేకుండా చేస్తాం. వారి కథ ముగించేస్తాం’ అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో అక్షరాల నిజమయ్యేలా కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో నెల రోజుల ముందుగానే మావోయిస్టు ఉద్యమం పతనవస్థకు చేరుకుందన్న ప్రచారం సాగుతోంది. దానికి కారణం ప్రస్తుతం మావోయిస్టు అగ్రనేతగా పిలవబడుతున్న దేవ్ జీ లొంగుబాటు.



# మావోయిస్టు ఉద్యమం ముగిసినట్లే?

కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ కగార్ మావోయిస్టులకు తీరని నష్టాన్నే మిగిల్చిందని చెప్పచ్చు. కగార్ లో చలపతి, కేశవరావు, హిడ్మా ఇలా అనేక మంది అగ్రనేతలు మృత్యువాత పడ్డారు. ఈ తరుణంలో కేంద్ర కమిటీకి చెందిన మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న వంటి అగ్రనేతలు లొంగిపోయారు. తాజాగా పార్టీ కేంద్ర కార్యదర్శిగా చెబుతున్న దేవ్ జీ అలీయాస్ తిప్పిరి తిరుపతి, మల్లా రాజిరెడ్డి లొంగిపోవడంతో ఇక మావోయిస్టు శకం ముగిసినట్లేనని చెబుతున్నారు. మావోయిస్టు పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన అగ్రనేత గణపతి వృద్ధాప్యంతో విదేశాల్లో తలదాచుకున్నారని, మరో నేత బడే చొక్కారావు అలియాస్ దామోదర్ ఆచూకీ మాత్రం తెలియడం లేదని పోలీసులు అంటున్నారు. దాదాపు ఆరు దశాబ్దాలుగా కొనసాగుతున్న మావోయిస్టు తుపాకీ పోరాటం ఈ ఏడాదితో చివరిదశకు చేరుకున్నట్లే.



వరుస ఎన్‌కౌంటర్లు, కీలక నేతల లొంగుబాట్లు, పలువురు అగ్రనేతల అనారోగ్య సమస్యలతో మావోయిస్టు పార్టీ తన ప్రభావాన్ని కోల్పోతూ వచ్చింది. ఒకప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో బలంగా ఉన్న పీపుల్స్ వార్ ఉద్యమం వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో బలహీన పడుతూ వచ్చింది. ఆ తర్వాత ఏవోబీ కి మాత్రమే పరిమితమైన మావోయిస్టులు బహిరంగంగా జనంలోకి వచ్చి కార్యకలపాలు చేసే పరిస్థితి లేకుండా పోయింది. అడపాదడపా కార్యక్రమాలు నిర్వహించడం తప్ప పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి ఉద్యమాలు నిర్మించే స్థితిలో మావోయిస్టులు లేరు. దీంతో వారంతా కేవలం అడవులకే పరిమితమయ్యారు. ఇక అగ్రనేతలంతా 50 ఏండ్లు దాటిన వారే కావడం, అనారోగ్యాలతో బాధపడుతుండటం, యువత నక్సల్స్ ఉద్యమంలోకి వెళ్లడానికి ఆసక్తి చూపకపోవడంతో పార్టీ మరింత దెబ్బతింది. బయటనుంచి కూడా వారికి సరైన సహకారం అందే పరిస్థితి లేదు. బయట ఉన్న కవర్ సంఘాలు, ప్రజాసంఘాల నేతలు నేరుగా మావోయిస్టులను కలిసి చర్చించే పరిస్థితి లేకపోవడంతో కమ్యూనికేషన్ పూర్తిగా దెబ్బతింది.

**ఒకప్పుడు సమస్య వస్తే అన్నలు పరిష్కరిస్తారనే నమ్మకం పేదలకు ఉండేది. ప్రభుత్వాలు, పోలీసులు చేయలేని పని వారు చేస్తారన్న విశ్వాసం ఉండేది. దాంతో ప్రజలు అన్నలను ఆదరించారు. పోలీస్ స్టేషన్ లో జరగని న్యాయం తుపాకీ నీడన జరుగుతుందన్న నమ్మకంతో ప్రజలు అన్నలను ఆశ్రయించేవారు. ప్రజలకు అన్యాయం జరిగినపుడు ప్రజాకోర్టు పేరుతో అన్నలు ఇచ్చే సత్వర తీర్పు ప్రజలకు వారిమీద మరింత విశ్వాసాన్ని పెంచింది. అయితే**

రానురాను నిర్బంధం పెరగడంతో ప్రజలకు, అన్నలకు మధ్య దూరం పెరుగుతూ వచ్చింది. అలాగే పోలీస్ వ్యవస్థలో కూడా గతంతో పోలిస్తే మార్పు వచ్చింది. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిండంతో పాటు ప్రజలకు న్యాయం చేయడానికి అవకాశం ఉండటంతో వారు పోలీస్ స్టేషన్‌ల గడప తొక్కడానికి మార్గం సుగమమైంది. దీంతో అన్నలపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా పోయింది.

ఆరుపదుల మావోయిస్టు ఉద్యమంలో సాధించిన విజయాలు పక్కన పెడితే.. ఆత్మరక్షణ కోసం అడవుల్లో దాక్కోవడం తప్ప ప్రజల్లోకి వచ్చి ఉద్యమాలు నిర్మించే పరిస్థితి మావోయిస్టులకు లేకుండా పోయింది. మావోయిస్టులు కూడా తుపాకి గొట్టం ద్వారా విప్లవాన్ని సాధిస్తామని చెప్పడం, వర్గ శత్రు నిర్మూలన తప్ప నిర్మాణాత్మక కార్యకలపాలు చేపట్టే పరిస్థితిలో లేకపోవడంతో వారికి ఆధరణ తగ్గతూ వచ్చింది. భారతదేశం వంటి ప్రజాస్వామ్య దేశంలో ఓటింగ్ ప్రక్రియద్వారా తమకు నచ్చిన నేతలను ఎన్నుకుంటున్న ప్రస్తుత తరుణంలో తుపాకిన్యాయం మీద ప్రజలకు రోజురోజుకు విశ్వాసం సన్నగిల్లుతూ వచ్చింది. ఒకప్పుడు ప్రజలు, ప్రభుత్వం, అన్నల మధ్య సాగిన పోరాటం ఇపుడు కేవలం పోలీసులు, నక్సల్స్ అనే స్థితికి చేరుకుంది. కేవలం భద్రతాదళాలతో పోరాడటం తప్ప ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించే పరిస్థితి మావోయిస్టులకు లేకుండా పోయింది. ఇది వారికి ప్రజలను దూరం చేసిందనే చెప్పాలి.

**అగ్రకులాలు, జమీందారులు, దొరలు, భూస్వాముల వంటి బడా బాబుల చేతుల్లో అన్యాయానికి గురవుతున్న పీడిత, తాడిత, బడుగు, బలహీన వర్గాల పక్షాన పోరాడడానికి ఆయుధం ఒక్కటే మార్గమని నమ్మిన నాటి విద్యావంతులైన యువకులు ఎందరో అన్నల బాట పట్టారు. ఉస్మానియ యూనివర్శిటీ, కాకతీయ మెడికల్ కాలేజీ, వరంగల్ రీజనల్ ఇంజినీరింగ్ కాలేజీ (ఆర్ఈసీ) వంటి విద్యాసంస్థల్లో ఉన్నత చదువులు చదివినా, చదువుకుంటున్న ఎందరో అడవిబాట పట్టారు. ఆయుధాలు చేత పట్టారు. అయితే నేడు ఆ పరిస్థితి లేదు. ఉన్నత చదువులు, ఉద్యోగాలు ,విదేశాలు, ఉన్నత జీవితం అనేది నేటి యువత కాన్సెప్ట్. అంతేకాదు పారిశ్రామికీకరణ. గ్లోబలైజేషన్ పుణ్యమా అని ఉద్యోగ అవకాశాలు పెరిగాయి, ప్రభుత్వ రంగ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలువుతున్నాయి. దీంతో బడుగు, బలహీన, అగ్ర అనే తేడా లేకుండా అందరికీ ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయి. దీంతో మావోయిస్టుల్లోకి రిక్రూట్ మెంట్లు పూర్తిగా ఆగిపోయాయి.**



- మధుకర్ వైద్యుల,
సీనియర్ జర్నలిస్ట్
ఫోన్ నంబర్: 8096677409

ఇక బయటి ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం విపరీతంగా పెరిగింది. కంప్యూటర్లు, మొబైల్ పోన్లు, డ్రోన్లు, రోబోలు, డిజిటల్ టెక్నాలజీ ఎంతో వృద్ధి చెందింది.. ఈ టెక్నాలజీని మావోయిస్టులు ప్రస్తుత ఉద్యమానికి అన్వయించుకోలేకపోయారు. దీంతో వారికి అర్బన్ ప్రాంతంలో ఉన్న సానుభూతిపరులు, ప్రజాసంఘాల నుంచి సమాచారం సేకరించడం కష్టసాధ్యమైంది. మొబైల్ వంటి సాధనాలు వారి ఉనికిని పసిగట్టడానికి సులువైన మార్గాలుగా మారాయి. డ్రోన్లు, తేలికపాటి విమనాలు అడవుల్లో వారి స్థావరాలను టార్గెట్ చేయడానికి ఈజీగామారాయి.

**నోట్ల మార్పిడి మావోయిస్టులను కోలుకోలేని దెబ్బ తీసింది. పార్టీ వద్ద పోగైన కోట్లాది రూపాయాలను మార్పిడి చేసుకునే అవకాశం లేకుండా పోయింది. ఆధునిక ఆయుధాలు కొనలేని పరిస్థితి నెలకొంది. దీంతో భద్రతా దళాలతో పోరాడే సమయంలో వారికి సంప్రదాయ ఆయుధాలు తప్ప మరోమార్గం లేకుండాపోయింది. మావోయిస్టుల వద్ద పేరుకుపోయిన సుమారు 20 నుంచి 50 కోట్ల రూపాయల పాత నోట్లు మార్పిడి చేసుకునే అవకాశం వారికి చిక్కలేదు. కొంత ధనాన్ని మావోయిస్టు పార్టీ సానుభూతిపరుల ద్వారా మార్చుకున్నప్పటికీ అది పార్టీ కార్యకలపాలకు ఏమాత్రం సరిపోలేదు.అంతేకాక కొంతమంది సానుభూతి పరులు, ప్రజాసంఘాల నేతలు నోట్ల మార్పిడి కోసం తీసుకున్న డబ్బులను పార్టీకి తిరిగి చెల్లించలేదని ఇటీవల మావోయిస్టు పార్టీ అగ్రనేత ఒకరు చెప్పడం గమనార్హం. ఇలా ఆర్థికంగా కూడా మావోయిస్టులు తీవ్రంగా నష్టపోయారు.**

ఇక చివరిగా మావోయిస్టు ఉద్యమం ప్రజాఉద్యమంగా మార్పు చెందాల్సిన సమయంలో ఆ దిశలో అడుగులు వేయలేకపోయిందనే చెప్పాలి. దండకారణ్యంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే కొంతమేర ప్రజలకు ఉపకరించే పనులు కొద్దో గొప్పో చేసినప్పటికీ అక్కడి ప్రజలు సైతం నేడు అభివృద్ధిని కోరుకుంటున్నారు. ఏండ్ల తరబడి విద్యుత్, రోడ్లు, విద్య, తాగునీరు, వాహన సౌకర్యం వంటి కనీస వసతులను చూడలేని ఆదివాసీలు ఇపుడిపుడే ఆధునికతవైపు అడుగులు వేస్తున్నారు. వారు అన్నలకంటే అత్యావసరాల వైపే మొగ్గు చూపుతున్నారనేది ఇటీవల పరిణామాలు రుజువు చేస్తున్నాయి. ఈ తరుణంలో అడవుల్లో అన్నలకు కనీస మద్దతు లభించే అవకాశాలు అంతంత మాత్రమే. ఈ తరుణంలో అగ్రనేతలకు లొంగుబాటు తప్ప మరో మార్గం లేదనే చెప్పాలి. లొంగిపోయిన నాయకులు బాహ్య ప్రపంచంలో ప్రజలతో మమేకమై ప్రజా ఉద్యమాలు నిర్మిస్తారా? లేక ప్రభుత్వం చూపే ఉపాధి అవకాశాలను వినియోగించుకుని ఉద్యమాలకు చరమగీతం పాడుతారా అనేది పక్కన పెడితే ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే మావోయిస్టు సాయుధ పోరాటానికి చివరి అంకమే అన్నది మాత్రం నూటికి నూరుపాళ్లు నిజమే అన్నది అక్షర సత్యం.

---



## కుక్క నాకితే.. కాళ్లు, చేతులు పోయాయ్!

**బ్రిటన్‌లో మహిళకు తీవ్ర ఇన్ఫెక్షన్**

లండన్: బ్రిటన్‌లో నివసిస్తున్న భారత సంతతి మహిళ జీవితంలో ఊహించని విషాదం చోటుచేసుకుంది. ఎంతో ప్రేమగా పెంచుకుంటున్న కుక్క.. మహిళ గాయాన్ని నాకడంతో ఆమె సెప్సిస్ బారిన పడి, రెండు చేతులు, రెండు కాళ్లు కోల్పోవాల్సి వచ్చింది. ఈ హృదయ విదారక ఘటన పెంపుడు జంతువుల యజమానులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వివరాల్లోకి వెళితే, యూకేలోని వుల్వర్‌హాంప్టన్‌కు చెందిన మంజిత్ సంఘా (52) అనే మహిళ గత ఏడాది జూలైలో అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం సాయంత్రం పని నుంచి ఇంటికి వచ్చిన ఆమెకు అనారోగ్యంగా అనిపించగా, మరుసటి రోజు ఉదయానికి స్పృహ కోల్పోయారు. ఆమె చేతులు, కాళ్లు చల్లగా మారడం, పెదవులు నీలంగా మారడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఆమె భర్త కమల్‌జిత్ సంఘా బీబీసీకి వివరిస్తూ, “ఒక్క రోజులో అంతా మారిపోయింది. శనివారం కుక్కతో ఆడుకుంది, ఆదివారం పనికి వెళ్లింది, సోమవారానికి కోమాలోకి వెళ్లిపోయింది” అని ఆవేదన వ్యక్తం చేశారు. న్యూ క్రాస్ ఆసుపత్రిలోని ఐసీయూలో చేర్చిన వైద్యులు, ఆమె సెప్సిస్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. కుక్కల లాలాజలంలో సహజంగా ఉండే ‘క్యాప్నోసైటోఫాగా కానిమోర్సస్’ అనే బ్యాక్టీరియా, ఆమె శరీరంలోని చిన్న గాయం ద్వారా రక్తంలోకి ప్రవేశించిందని గుర్తించారు. ఈ ఇన్‌ఫెక్షన్ కారణంగా ఆమెకు ఆరుసార్లు గుండెపోటు వచ్చింది. ప్రాణాలు కాపాడే క్రమంలో వైద్యులు ఆమె రెండు కాళ్లు (మోకాళ్ల కింద), రెండు చేతులు తొలగించారు. ఆమె ప్లీహాన్ని కూడా తీసేయాల్సి వచ్చింది. సుమారు 32 వారాల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందిన మంజిత్, ఇటీవల ఇంటికి తిరిగి వచ్చారు. పెంపుడు జంతువులతో ఆడుకునేటప్పుడు, వాటి లాలాజలం గాయాలకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ ఘటన హెచ్చరిస్తోంది.

---

# బీజేపీకి తమిళ ప్రజల గుణపాఠం

## మోదీ, అమిత్ షాపై ఉదయనిధి మండిపాటు

చెన్నై: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై తమిళనాడు ఉప ముఖ్యమంత్రి, డీఎంకే యువజన విభాగం కార్యదర్శి ఉదయనిధి స్టాలిన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి తమిళనాడు ప్రజలు గట్టి గుణపాఠం చెబుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కోయంబత్తూరు జిల్లా కనియూర్‌లో డీఎంకే యువజన విభాగం పశ్చిమ మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆయన, బీజేపీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. “ఎన్నికల్లో బీజేపీ ముఖానికి తమిళ ప్రజలు నలుపు రంగు పూసి, తగిన రాజకీయ సమాధానం ఇస్తారు” అని ఆయన వ్యాఖ్యానించడంతో పార్టీ కార్యకర్తల నుంచి పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పిస్తూ, ఆయన టీవీలో కనిపిస్తే చాలు ప్రజల్లో ఆందోళన మొదలవుతోందని ఉదయనిధి ఎద్దేవా చేశారు. గతంలో ఆకస్మికంగా ప్రకటించిన కరోనా లాక్‌డౌన్, పెద్ద నోట్ల రద్దు వంటి నిర్ణయాలు దేశవ్యాప్తంగా ప్రజల్లో భయాందోళనలు, తీవ్ర కష్టనష్టాలు సృష్టించాయని గుర్తుచేశారు.



“ప్రజలకు ఇచ్చేది డీఎంకే ప్రభుత్వం అయితే, ప్రజల నుంచి డబ్బులు లాక్కునేది బీజేపీ ప్రభుత్వం” అని ఆయన ఆరోపించారు. ఇటీవల కారైకాల్‌లో పర్యటించిన అమిత్ షాను ఉద్దేశించి, “మీరు ఎన్ని రంగులు పూసుకున్నా, ఎన్నికల్లో తమిళ ప్రజలు మీ ముఖానికి నలుపు పూయడం ఖాయం” అని అన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలకు, ప్రధాని మోదీకి తాము భయపడబోమని ఉదయనిధి స్టాలిన్ స్పష్టం చేశారు. “మేం ఈడీకి భయపడం, మోదీకి భయపడం. ఎన్నికలను సాకుగా చూపి అభివృద్ధి పథకాలను అడ్డుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది” అని విమర్శించారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆ పార్టీ స్వాతంత్ర్యాన్ని బీజేపీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. “కొందరు మా ఉద్యమాన్ని నాశనం చేయాలని పగటి కలలు కంటున్నారు. కానీ డీఎంకేను ఎప్పటికీ ఎవరూ కూల్చలేరు” అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశానికి పాలన, రాజకీయాల్లో తన తండ్రి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మార్గదర్శకంగా నిలుస్తున్నారని, ఆయన నాయకత్వంలో బీజేపీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య పోరాటం చేయాలని పలు రాష్ట్రాల నేతలు ఆకాంక్షిస్తున్నారని ఉదయనిధి తెలిపారు. రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలపై కూడా ఉదయనిధి విమర్శలు గుప్పించారు. తమిళనాడులో ఎన్ని పోలింగ్ బూత్‌లు ఉన్నాయో కూడా తెలియకుండా కొందరు సర్వేలు నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు.

---

# ఖమేనీ అంతానికి ట్రంప్ ప్లాన్

**ఆయన కుమారుడినీ అంతం చేసేలా వ్యూహం!**

వాషింగ్టన్: అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరుకుంటున్నాయి. ఇరాన్ అణు కేంద్రాలపైనే కాకుండా, ఏకంగా ఆ దేశ అత్యున్నత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ, ఆయన వారసుడిగా భావిస్తున్న కుమారుడు మొజ్తాబా ఖమేనీలను లక్ష్యంగా చేసుకునే సైనిక ప్రణాళికలను అమెరికా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రముఖ వార్తా సంస్థ ‘ఆక్సియోస్’ ఒక కథనాన్ని ప్రచురించింది. ఇరాన్ తదుపరి పాలకుడిగా రేసులో ఉన్న మొజ్తాబా పేరు కూడా ఈ జాబితాలో ఉండటం ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇరాన్ విషయంలో అన్ని రకాల ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నామని అమెరికా ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఒకవేళ యుద్ధం అనివార్యమైతే ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని తొలగించేందుకు కూడా వెనుకాడబోమని ట్రంప్ సలహాదారు ఒకరు



పేర్కొన్నారు. మరోవైపు, ఇరాన్‌పై పరిమిత దాడులు చేసే ఆలోచనలో ఉన్నారా అన్న ప్రశ్నకు తాను దాని గురించి ఆలోచిస్తున్నానని అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా బదులిచ్చారు. చర్చలకు రావడానికి ఇరాన్‌కు 10-15 రోజులు సమయం ఇస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అమెరికా హెచ్చరికలపై ఇరాన్ కూడా ఘాటుగానే స్పందించింది. తాము చర్చలకు సిద్ధంగా ఉన్నామని, అయితే దాడులు జరిగితే యుద్ధానికి కూడా వెనుకాడబోమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చీ తేల్చి చెప్పారు. అమెరికా దాడులకు పాల్పడితే మధ్యప్రాచ్యంలోని వారి సైనిక స్థావరాలే తమ తదుపరి లక్ష్యాలని ఐక్యరాజ్యసమితికి ఇరాన్ ఇప్పటికే తెలియజేసింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా గత రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా మధ్యప్రాచ్యంలో సైన్యాన్ని మోహరించింది. ఇప్పటికే రెండు అమెరికా విమాన వాహక నౌకలు ఇరాన్ తీరానికి సమీపంలో ఉన్నాయి. ఖతార్, బహ్రెయిన్ వంటి దేశాల నుంచి వేలాది మంది సైనికులను వ్యూహాత్మక ప్రాంతాలకు తరలించింది. ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడం పూర్తిస్థాయి యుద్ధానికి దారితీయవచ్చని, ఇది వినాశకర పరిణామాలకు కారణమవుతుందని అంతర్జాతీయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

---

## పెరంబూర్ నుంచి విజయ్ పోటీ?

**టీవీకే కార్యకర్తల ఏకగ్రీవ తీర్మానం**

చెన్నై: తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ, 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం తమ వ్యూహాలకు పదును పెడుతోంది. ఇందులో భాగంగా, పార్టీ అధ్యక్షుడు విజయ్ పెరంబూరు నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని కోరుతూ పార్టీ శ్రేణులు ఏకగ్రీవంగా తీర్మానం చేశాయి. ఉత్తర చెన్నైని రాబోయే రాజకీయ పోరుకు కేంద్రంగా మార్చాలన్న పార్టీ ఉద్దేశం దీని ద్వారా స్పష్టమవుతోంది. ఆదివారం చెన్నైలో జరిగిన పార్టీ సమావేశంలో టీవీకే ఎన్నికల ప్రచార నిర్వహణ కార్యదర్శి ఆదవ్ అర్జున ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. పెరంబూరు నుంచి విజయ్ పోటీ చేయాలన్నది కార్యకర్తలందరి ఏకగ్రీవ అభిప్రాయమని ఆయన తెలిపారు. ఈ తీర్మానానికి పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్. ఆనంద్ మద్దతు తెలిపారు. కార్యకర్తల మనోభావాలను గౌరవిస్తామని, వారి ఆకాంక్షను దళపతి విజయ్‌కు తెలియజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ డిమాండ్ వెనుక ఉన్న కారణాన్ని వివరిస్తూ ఆదవ్ అర్జున కీలక వ్యాఖ్యలు చేశారు. పేదరికం ఎక్కువగా, ప్రజల అవసరాలు అధికంగా ఉన్న నియోజకవర్గాల నుంచే పోటీ చేయాలన్నది తమ పార్టీ సిద్ధాంతమని, ఉత్తర చెన్నైలోని పరిస్థితులు దీనికి సరిగ్గా సరిపోతాయని అన్నారు. పెరంబూరు, కొళత్తూరు, లేదా ఆర్.కె. నగర్ వంటి ఉత్తర చెన్నై నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకే విజయ్ కూడా మొగ్గు చూపుతున్నారని ఆయన వెల్లడించారు. ఇదే సమయంలో, అధికార డీఎంకేపై ఆదవ్ అర్జున విమర్శలు గుప్పించారు. చెన్నై డీఎంకేకు కంచుకోట అన్న వాదనను ఆయన తోసిపుచ్చారు. “ఇకపై చెన్నై టీవీకేదే” అని ప్రకటించి, ఆ అభిప్రాయాన్ని మార్చడానికే తాము రాజధాని నుంచి ప్రచారం ప్రారంభిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో డీఎంకే ఆధిపత్యం ఉందని చెబుతున్నా, స్థానిక బలమైన నేతలు ఇప్పుడు టీవీకే వైపు చూస్తున్నారని మంత్రి పి.కె. శేఖర్ బాబును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ పరిణామంతో, 2026 ఎన్నికల్లో చెన్నై కేంద్రంగా టీవీకే దూకుడుగా ప్రచారం చేయనుందన్న సంకేతాలు వెలువడుతున్నాయి.

## ముగ్గురు ఉగ్రవాదులను పట్టించిన శునకం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాలు జరిపిన ఆపరేషన్‌లో ‘టైసన్’ అనే ఆర్మీ జాగిలం అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించింది. ఉగ్రవాదుల కాల్పుల్లో గాయపడినా వెనక్కి తగ్గకుండా, ముగ్గురు జైషే మహ్మద్ ఉగ్రవాదులను మట్టుబెట్టడంలో కీలక పాత్ర పోషించింది. కిష్టవాడ్ జిల్లా చత్రూ ప్రాంతంలో ఉగ్రవాదులు దాక్కున్నారన్న సమాచారంతో స్పెషల్ ఫోర్సెస్ రంగంలోకి దిగింది. వారి స్థావరాన్ని గుర్తించేందుకు సైన్యంలోని 2 పారా యూనిట్‌కు చెందిన జర్మన్ షెపర్డ్ జాతి శునకం టైసన్‌ను ముందుగా పంపారు. కఠినమైన భూభాగంలోకి దూసుకెళ్లిన టైసన్‌పై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ క్రమంలో దాని కాలికి బుల్లెట్ గాయమైనా, అది వెనుదిరగకుండా ముందుకు సాగింది. టైసన్ సాహసం వల్ల ఉగ్రవాదుల కచ్చితమైన స్థానం భద్రతా బలగాలకు తెలిసింది. దీంతో వారు వ్యూహాత్మకంగా దాడి చేసి, జైషే మహ్మద్‌కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చారు. మృతుల్లో రెండేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న జైషే కమాండర్ సైఫుల్లా కూడా ఉన్నాడు. ఎన్‌కౌంటర్ స్థలం నుంచి రెండు ఏకే-47 రైఫిళ్లను, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. గాయపడిన టైసన్‌ను వెంటనే హెలికాప్టర్‌లో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం దాని ఆరోగ్యం నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో జమ్మూకశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ కూడా పాల్గొన్నారు. ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లలో సైనిక జాగిలాల పాత్ర ఎంత కీలకమో ఈ ఘటన మరోసారి నిరూపించింది.

వయ్యారి చిత్రం




## కొత్త ప్రియుడితో మలైకా



మలైకా అరోరా వ్యక్తిగత జీవితం, కొత్త రిలేషన్‌షిప్ వార్తలు ఎప్పుడూ హాట్ టాపిక్. దాదాపు ఆరేళ్ల పాటు తనకంటే చిన్న వయసు హీరో అర్జున్ కపూర్ తో డేటింగ్ చేసిన మలైకా ఇటీవల ఒంటరిగా ఉంటోంది. అయితే 50 ప్లస్ వయసులోను మలైకా ఫీట్లు నిరంతరం సోషల్ మీడియాల్లో సంచలనంగా మారుతున్నాయి. తాజా సమాచారం మేరకు.. మలైకా ఇప్పుడు కొత్తగా రిలేషన్ లో అడుగుపెట్టింది. హర్ష్ మెహతా అనే 33ఏళ్ల వ్యాపారితో సన్నిహితంగా ఉంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇటీవల ఈ జోడీ రోమ్‌లో విహారయాత్రను ఆస్వాధిస్తున్న ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. అక్కడ వారు చాలా అన్యోన్యంగా కనిపించడంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే ప్రచారం మొదలైంది. హర్ష్ మెహతా ఎవరు? అంటే.. అతడు వజ్రాల వ్యాపారి. వయస్సు 33. బాలీవుడ్ సెలబ్రిటీల సర్కిల్‌లో ఆయనకు మంచి పరిచయాలు ఉన్నాయి. గతంలో ఎన్రిక్ ఇగ్లేసియాస్ సంగీత కచేరీలో కూడా మలైకాతో కలిసి అతడు కనిపించడంతో ఈ పుకార్లు మొదలయ్యాయి. అయితే మలైకా వయసు కంటే అతడి వయసు చాలా చిన్నది. మలైకా వయస్సు 52 ఏళ్లు కాగా, హర్ష్ వయస్సు 33 ఏళ్లు. వీరి మధ్య ఉన్న 19 ఏళ్ల వయస్సు అంతరంపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు.

## ప్యాడెడ్ బ్రాలు వేసుకొమ్మనేవారు: తాప్సీ

నటి తాప్సీ పన్ను తన తాజా చిత్రం అస్సీ ప్రమోషన్లలో నేపోటిజం (వారసత్వం) గురించి, సినీపరిశ్రమలోని పలు కీలక విషయాలపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా అలియా భట్, సందీప్ రెడ్డి వంగా చిత్రాల గురించి తాప్సీ స్పందించిన తీరు చర్చనీయాంశంగా మారింది. తాప్సీ సంచలన వ్యాఖ్యలను పరిశీలిస్తే... నెపోటిజం గురించి అడిగిన ప్రశ్నకు తాప్సీ చాలా ప్రాక్టికల్‌గా సమాధానమిచ్చారు. నేపో కిడ్ అలియా భట్ గురించి మాట్లాడుతూ –గంగూబాయి కతియావాడి–లో అద్భుతంగా నటించింది. అందుకే అదే దర్శకుడితో తనకు మళ్ళీ అవకాశం వచ్చింది. దీన్ని ఎవరూ నెపోటిజం అనరు.. ఎందుకంటే అక్కడ టాలెంట్ ఉంది.. అని ప్రశంసించింది. అసలు సమస్య ఎప్పుడు వస్తుందంటే.. టాలెంట్ ఉన్నా లేకపోయినా కేవలం ఒకే వర్గం నుంచి వచ్చిన వారికే వరుసగా అవకాశాలు ఇస్తూ ఔట్‌సైడర్లను పట్టించుకోనప్పుడు మాత్రమే అది సమస్యగా మారుతుందని అన్నారు.





## మొత్తానికి ఫేవరెట్ స్టార్ తో జాన్వీకపూర్!

ఎంత పెద్ద హీరోయిన్ అయినా అభిమాన హీరో అంటూ ఒకరుంటారు. నటిగా కెరీర్ ముగిసే లోపు ఒక్క సారైనా ఆ స్టార్ సరసన నటించాలని కోరుకుంటారు. కానీ అలా అందరి హీరోయిన్ల విషయంలో జరగదు. ఎంత ట్యాలెంట్ ఉన్నా? అదృష్టం కూడా కలిసొస్తేనే ఛాన్స్ అందుకోగలరు. పవన్ కళ్యాణ్ సరసన అనుష్క నటించాలని ఎంతో కాలంగా అనుకుంటోంది. కానీ ఆ కాంబినేషన్ ఇంత వరకూ సెట్ కాలేదు. ఏ దర్శకుడు కూడా వాళ్లిద్దర్నీ కలిపే ప్రయత్నం కూడా చేయలేదు. అలాగని పవన్ ఇమేజ్ కు సరితూగని హీరోయిన్ అంటే? అదీ కాదు అనుష్కను అభిమానించే తెలుగు వారు ఎంతో మంది ఉన్నారు. మరెందుకు నటించలేదంటే కాలం కలిసి రాకనే చెప్పాలి. ఆ సంగతి పక్కన బెడితే? జాన్వీ కపూర్ అభిమాన స్టార్ ఎవరు? అంటే రణబీర్ కపూర్ అని అందిరికీ తెలుసు.

# పుష్ప.. అక్కడ!

**ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్.. ఉత్తమ దర్శకుడిగా సుకుమార్.. ఉత్తమ చిత్రంగా పుష్ప-2 ది రూల్**



పుష్ప 2 చిత్రం తర్వాత ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రేంజ్ నిజంగా నెక్స్ట్ లెవల్‌కు చేరిందనే చెప్పాలి. ఈ సినిమా సృష్టించిన సంచలనం గురించి ఎంత చెప్పినా తక్కువే. మాస్, యాక్షన్, ఎమోషన్ ప్రతి అంశంలోనూ తన పీక్ పెర్ఫార్మెన్స్ చూపించిన అల్లు అర్జున్, బాక్సాఫీస్ వద్ద రూ.1300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సరికొత్త రికార్డులు నెలకొల్పారు. ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రకు గాను అల్లు అర్జున్ తాజాగా మరోసారి ఫిల్మ్‌ఫేర్ అవార్డును అందుకున్నారు. బెస్ట్ యాక్టర్‌గా ఈ గౌరవం అందుకోవడం ద్వారా ఆయన కెరీర్‌లో మొత్తం 7 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు పూర్తయ్యాయి. యంగ్ హీరోల్లో ఇన్ని ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్న నటుడిగా బన్నీ టాప్‌లో నిలవడం విశేషం. ఇక ఫిల్మ్‌ఫేర్ అవార్డుల సంఖ్యలో మెగాస్టార్ చిరంజీవికి అల్లు అర్జున్ సమానమయ్యాడు. చిరంజీవి తన కెరీర్‌లో 7 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకోగా, ఇప్పుడు 'పుష్ప 2'తో వచ్చిన ఈ అవార్డుతో బన్నీ కూడా అదే స్థాయికి చేరుకున్నారు. తక్కువ సినిమాలతో ఈ ఫీట్ సాధించడం విశేషమని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మెగాస్టార్ చిరంజీవి లైఫ్ టైమ్ అచీవ్ మెంట్, స్పెషల్ లెజెండ్ అవార్డుతో కలుపుకొని 9 ఫిలిం ఫేర్ అవార్డులు ఉన్న హీరోగా నిలిచారు. కాగా, గతంలో 'పరుగు', 'వేదం', 'రేసు గుర్రం' (క్రిటిక్స్), 'రుద్రమదేవి' (బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్), 'సరైనోడు', 'పుష్ప: ది రైజ్' సినిమాలకు గానూ అల్లు అర్జున్ ఫిలిం ఫేర్స్ అందుకున్నాడు.





### 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ (తెలుగు) విజేతలు ..!

**ఉత్తమ చిత్రం: పుష్ప 2: ది రూల్**
**ఉత్తమ దర్శకుడు: సుకుమార్ (పుష్ప 2: ది రూల్)**
**ఉత్తమ నటుడు -- అల్లు అర్జున్ (పుష్ప 2: ది రూల్)**
**ఉత్తమ నటి -- నివేదా థామస్ (35 చిన్న కథ కాదు)**
**ఉత్తమ సహాయ నటుడు: అమితాబ్ బచ్చన్ (కల్కి 2898 ఏడీ)**
**ఉత్తమ సహాయ నటి: అంజలి (గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి)**
**ఉత్తమ నటి (క్రిటిక్స్): కాజల్ అగర్వాల్ (సత్యభామ)**
**ఉత్తమ నటుడు (క్రిటిక్స్): తేజ సజ్జ (హను-మాన్)**
**బెస్ట్ డెబ్యూ ఫిమేల్ -- నయన్ సారిక (గం గం గణేశ)**
**బెస్ట్ డెబ్యూ మేల్ -- సందీప్ సరోజ్ (కమిటీ కుర్రోళ్లు)**
**బెస్ట్ డెబ్యూ డైరెక్టర్ -- యాధు వంశీ (కమిటీ కుర్రోళ్లు)**
**బెస్ట్ మ్యూజిక్ ఆల్బమ్: దేవిశ్రీ ప్రసాద్ (పుష్ప 2: ది రూల్)**
**బెస్ట్ ప్లేబ్యాక్ సింగర్ (మేల్): శ్రీకృష్ణ (కుర్చీ మడతపెట్టి- గుంటూరు కారం)**
**బెస్ట్ ప్లేబ్యాక్ సింగర్ (ఫీమేల్): శిల్పా రావు (చుట్టమల్లె -- దేవర: పార్ట్ 1)**
**బెస్ట్ లిరిక్స్ -- రామజోగయ్య శాస్త్రి (చుట్టమల్లె -- దేవర: పార్ట్ 1)**
**బెస్ట్ కొరియోగ్రఫీ: శేఖర్ మాస్టర్ ( కుర్చీ మడతపెట్టి -- గుంటూరు కారం)**
**బెస్ట్ ప్రొడక్షన్ డిజైన్: రామకృష్ణ-మోనికా (పుష్ప 2: ది రూల్),**
**నితిన్ జిహానీ చౌదరి (కల్కి 2898 ఏడీ)**







## శ్రీలీలకు మరో ఆఫర్


సౌత్ సినీ ఇండస్ట్రీలో వేగంగా ఎదుగుతున్న హీరోయిన్ల లిస్ట్ లో శ్రీలీల పేరు ఇప్పుడు స్పెషల్ గా వినిపిస్తోంది. ఒకే భాషకు పరిమితం కాకుండా, తెలుగుతో పాటు తమిళ, హిందీ సినిమాల్లో సమాంతరంగా అవకాశాలు అందుకోవడం.. ఆమె కెరీర్‌ను పాన్ ఇండియా దిశగా నడిపిస్తున్న వ్యూహాత్మక నిర్ణయంగా పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. శ్రీలీల ఈ ఇయర్ సంక్రాంతికి రిలీజైన పరాశక్తి మూవీతో కోలీవుడ్ కు పరిచయమయ్యారు. తన మొదటి సినిమా పరాశక్తి రిలీజ్ కంటే ముందే శ్రీలీల రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు సైన్ చేయడం విశేషం. అందులో కోలీవుడ్ స్టార్ ధనుష్ హీరోగా రూపొందుతున్న డీ55 ఒకటి కాగా, ఈ సినిమాకు అమరన్ ఫేమ్ రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. ధనుష్ మూవీతో పాటూ చియాన్ విక్రమ్ కొడుకు ధృవ్ విక్రమ్ సరసన కూడా శ్రీలీల ఓ సినిమాకు సైన్ చేశారు. యంగ్ హీరోలతో పాటూ ప్రయోగాత్మక కథలను ఎంపిక చేసుకుని, మార్కెట్ లో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని శ్రీలీల ప్రయత్నిస్తున్నట్టు క్లియర్ గా అర్థమవుతుంది. ఆల్రెడీ కోలీవుడ్ లో రెండు క్రేజీ ప్రాజెక్టుల్లో అవకాశాన్ని అందుకున్న లీలకు ఇప్పుడు మరో బంపరాఫర్ అందినట్టు తెలుస్తోంది. కోలీవుడ్ సూపర్ స్టార్ అజిత్ కుమార్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఏకే 64లో శ్రీలీల ఎంపికైనట్టు తెలుస్తోంది. గుడ్ బ్యాడ్ అగ్లీ మూవీ తర్వాత అజిత్- అధిక్ రవిచంద్రన్ కలయికలో వస్తున్న సినిమా కావడంతో ఈ మూవీపై మంచి అంచనాలున్నాయి.

## సినిమా అంతా పవనే

హైదరాబాద్‌లోని మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన –ఆరా ఆఫ్ ఉస్తాద్– సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకుడు హరీష్ శంకర్ ప్రసంగం అభిమానుల్లో పూనకాలు తెప్పించింది. ఆయన స్పీచ్‌లోని ఎగ్జయిట్ చేసే విషయాలను పరిశీలిస్తే.. ఈ సినిమాలో పవన్ కల్యాణ్ గారి ఫ్యాన్స్ ఏం కోరుకుంటారో అవన్నీ ఉన్నాయని అన్నారు. ఆయన హెయిర్ స్టైల్, డ్రెస్సింగ్, ఆయన సెన్సాఫ్ హ్యూమర్, సజహంగా ఉండే ఎనర్జీ.. ఇలా ప్రతిదీ ఈ సినిమాలో చూడబోతున్నారు. సాధారణంగా సినిమాల్లో హీరో ఎంతసేపు కనిపిస్తారు. కానీ ఈ రెండున్నర గంటల సినిమాలో దాదాపు 2 గంటల పాటు పవన్ కల్యాణ్ గారే స్క్రీన్ మీద ఉంటారు. ఆయన బాడీ లాంగ్వేజ్, ఆ నవ్వు.. ప్రతి ఫ్యాన్‌కి నచ్చేలా డిజైన్ చేశాను. కలెక్షన్లు, సక్సెస్ అనేది దైవాధీనం.. దాని గురించి నేను మాట్లాడను. కానీ, సినిమాకి వచ్చిన ప్రతి పవన్ కల్యాణ్ అభిమాని మా అన్నను ఇలా చూడాలనుకున్నాం! అని గర్వంగా చెప్పుకునేలా ఈ సినిమా ఉంటుంది. ఆయన ఈ సినిమా కోసం కోట్లు వదులుకుని టైమ్ ఇచ్చారు.. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను! అని అన్నారు.






# భారత్ చిత్తు

## సూపర్-8లో సఫారీలపై ఓటమి.. 111 రన్స్‌కే కుప్పకూలిన సూర్య సేన

**టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఆదివారం అహ్మదాబాద్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో భారత్ ఘోర పరాజయం పాలైంది. ప్రొటీస్ జట్టు విధించిన 188 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా 111 పరుగులకే ఆలౌ ట్ అయ్యింది. మాత్రమే చేయగలిగింది. 2024 ప్రపంచకప్ ఫైనల్‌లో ఓటమికి భారత్‌ను దక్షిణాఫ్రికా 76 పరుగుల తేడాతో ఓడించి ప్రతీకారం తీర్చుకుంది.**

దక్షిణాఫ్రికా బౌలర్ల ధాటికి టీమిండియా బ్యాటర్స్ ఎవరూ క్రీజులో నిలువలేకపోయారు. మార్కో జాన్సన్, కార్బిన్ బాష్, కేశవ్ మహరాజ్ బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు ఇబ్బందిపడ్డారు. టీ20 వరల్డ్ కప్‌లో భారత్‌కు ఇదే తొలి ఓటమి కాగా.. దక్షిణాఫ్రికా ఐదు విజయాలను నమోదు చేసింది. వరుసగా మూడు మ్యాచుల్లో డకౌట్ అయిన విధ్వంసకర బ్యాట్స్‌మెన్‌గా పేరున్న అభిషేక్ శర్మ (15) మరోసారి నిరాశ పరిచాడు. ఈ వరల్డ్ కప్‌లో ఫుల్ ఫామ్‌లో ఉన్న స్టార్ బ్యాట్స్‌మెన్ ఇషాన్ కిషన్ ఈ మ్యాచ్‌లో డకౌట్ అయ్యాడు. నాలుగు బంతులు ఆడిన ఇషాన్ మార్క్రామ్ బౌలింగ్‌లో రికెల్టన్‌కు క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. రెండో ఓవర్‌లో భారత్ 5 పరుగుల వద్ద తిలక్ వర్మ (1) మార్కో జాన్సన్ బౌలింగ్‌లో కీపర్ క్వింటన్ డికాక్‌కు క్యాచ్ ఇచ్చి అవుట్ అయ్యాడు. అనంతరం వాషింగ్టన్ సుందర్ (11), కెప్టెన్ సూర్యకుమార్ (18), రింకు సింగ్ (0), హర్షదీప్ సింగ్ (1) పెవిలియన్‌కు చేరారు. ఇక చివరలో శుభ్‌దూబే (42) మెరుపులు మెరిపించినా ఫలితం లేకుండాపోయింది. టీమిండియా బ్యాట్స్‌మెన్‌లో ఐదుగురు రెండంకెల స్కోర్ చేయడంలో విఫలమయ్యారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో జాన్సన్‌కు నాలుగు వికెట్లు, కేషవ్ మహరాజ్‌కు మూడు, కార్బిన్ బాష్‌కి రెండు వికెట్లు దక్కగా.. మార్క్రామ్‌కి ఒక వికెట్ పడగొట్టాడు. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా భారీ స్కోర్ చేసింది. భారీ స్కోర్ టార్గెట్‌లో బరిలోకి దిగిన భారత జట్టుపై దక్షిణాఫ్రికా బౌలర్లు నిప్పులు చెరిగే బంతులతో విరుచుకుపడ్డారు. ఏ దశలోనూ టీమిండియా బ్యాట్స్‌మెన్‌కు అవకాశం ఇవ్వలేదు. క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఒత్తిడి పెంచారు. అలాగే, రన్స్ తీసేందుకు కూడా బ్యాట్స్‌మెన్ ఇబ్బందిపడ్డారు. ఒక దశలో టీమిండియా పది ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 57 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆరంభం నుంచే ప్రొటీస్ బౌలర్లు పట్టు భిగించారు. వరుసగా టీ20 ప్రపంచకప్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడుతూ వచ్చిన ఇషాన్ కిషన్‌ను కెప్టెన్ ఐడెన్ మార్క్రామ్ తొలి ఓవర్‌లోనే పెవిలియన్ టీమిండియా బ్యాటింగ్ పతనానికి బాటలు వేశాడు. ఆ తర్వాత మార్కో జాన్సెన్, కార్బిన్ బాష్, లుంగి ఎన్గిడి, టీమిండియా ఓటమిని శాసించారు. ఓ వైపు బౌలర్లు అద్భుత ప్రదర్శన చేయగా.. మరో వైపు ఫీల్డర్లు సైతం సహకారం అందించారు. కళ్లు చెదిరేలా క్యాచులు అందుకుంటూనే.. మరో వైపు పరుగులు తీయకుండా అడ్డుకట్ట వేశారు. ఈ టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా ఆడిన ఐదు మ్యాచుల్లోనూ విజయాన్ని నమోదు చేసింది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా భారత జట్టుకు 188 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. 20 ఓవర్లలో 7 వికెట్లకు 187 పరుగులు చేసింది. డేవిడ్ మిల్లర్ 63, డెవాల్డ్ బ్రెవిస్ 45, ట్రిస్టన్ స్టబ్స్ 44లి రాణించారు. జస్ప్రీత్ బుమ్రా రాణించినా.. మిగతా బౌలర్లు ప్రొటీస్ జట్టు బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేయలేకపోయారు. సఫారీ జట్టు ఆరంభంలోనే 20 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. క్వింటన్ డి కాక్ 6, మార్క్రమ్ 4, ర్యాన్ రికెల్టన్ 7 త్వరగా ఔటయ్యారు. అనంతరం బ్రెవిస్--మిల్లర్ జోడీ 97 పరుగుల భాగస్వామ్యంతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. మిల్లర్ దూకుడు పెంచి 35 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 63 పరుగులు సాధించాడు. చివర్లో స్టబ్స్ 24 బంతుల్లో 44 పరుగులు చేసి స్కోరును వేగంగా పెంచాడు. బుమ్రా 4 ఓవర్లలో 15 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీసుకోగా, అర్షదీప్ సింగ్ 2 వికెట్లు సాధించాడు. హార్దిక్ పాండ్యా 45, వరుణ్ చక్రవర్తి 47 పరుగులు ఇవ్వడంతో దక్షిణాఫ్రికా భారీ స్కోర్ చేయగలిగింది.






## ధోనీ 2026 ఐపీఎల్ ఆడతాడు: సీఎస్కే

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ముగిసిన కొద్ది రోజులకే ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) 2026 సీజన్‌కు తెరలేవనుంది. ఇప్పటికే షెడ్యూల్ ఖరారు చేయడంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) కసరత్తులు చేస్తోంది. మార్చి మూడో వారంలో ఈ ధనాధన్ లీగ్‌కు తెరలేవనుంది. అయితే ఈ సీజన్‌లో టీమిండియా దిగ్గజ క్రికెటర్, చెన్నై సూపర్ కింగ్స్ స్టార్ ప్లేయర్ మహేంద్ర సింగ్ ధోనీ ఆడటంపై సందేహాలు నెలకొన్నాయి. 44 ఏళ్ల వయసులో ఉన్న ధోనీ.. ఐపీఎల్ 2026 సీజన్ ఆడుతాడా? లేక తప్పుకుంటాడా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలి పోయింది. గత 6 ఏళ్లుగా తన రిటైర్మెంట్‌పై ధోనీ ఊరిస్తున్నాడు. 2020లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ధోనీ కేవలం ఐపీఎల్ మాత్రమే ఆడుతున్నాడు. అప్పటి నుంచి ప్రతీ సీజన్‌కు ముందు అతను ఆడటంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే తాజా సీజన్‌కు ముందు కూడా ధోనీ రిటైర్మెంట్ వార్తలు షికారు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) అభిమానులకు ఆ జట్టు సీఈఓ కాశీ విశ్వనాథన్ గుడ్ న్యూస్ చెప్పాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో ధోనీ ఆడుతాడని స్పష్టం చేశాడు. ధోనీ రిటైర్మెంట్ వార్తలను కొట్టిపారేసాడు. ఐపీఎల్ ప్రారంభం నుంచి ధోనీ సీఎస్‌కే జట్టులోనే కొనసాగుతున్నాడు. అతని సారథ్యంలో సీఎస్‌కే ఐదు టైటిళ్లు గెలిచింది. ముంబై ఇండియన్స్ తర్వాత ఐదు టైటిళ్లు గెలిచిన జట్టు సీఎస్‌కేనే కావడం గమనార్హం. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వానథన్‌ను ధోనీ రిటైర్మెంట్ వార్తల గురించి ప్రశ్నించగా.. అతను ఆడుతాడని స్పష్టం చేశాడు. ఐపీఎల్ 2024 సీజన్‌కు ముందే ధోనీ సారథ్య బాధ్యతలను వదులుకొని రుతురాజ్ గైక్వాడ్‌కు అప్పగించాడు. అయితే గత సీజన్‌లో అతను గాయంతో దూరమవడంతో తిరిగి జట్టును నడిపించాడు. కానీ ఈ సీజన్‌లో సీఎస్‌కే అత్యంత చెత్త ప్రదర్శన కనబర్చింది. 14 మ్యాచ్‌ల్లో 4 మాత్రమే గెలిచి పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానంలో నిలిచింది. వరుసగా రెండో సీజన్‌లోనూ ప్లే ఆఫ్స్ చేరలేకపోయారు.




## వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్‌పై వేటు

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో భాగంగా సౌతాఫ్రికాతో జరుగుతున్న సూపర్-8 పోరులో టీమిండియా టాస్ ఓడి ఫీల్డింగ్‌కు దిగింది. అయితే ఈ మ్యాచ్‌లో టీమిండియా ఎలాంటి మార్పులు లేకుండా గత కాంబినేషన్‌తోనే బరిలోకి దిగుతోంది. దాంతో వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్‌పై వేటు పడింది. అయితే ఇది వ్యూహాత్మకంగా తీసుకున్న నిర్ణయమని టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ టాస్ సందర్భంగా వెల్లడించాడు. సౌతాఫ్రికా బ్యాటింగ్ లైనప్‌లో లెఫ్టార్మ్ బ్యాటర్లు ఎక్కువగా ఉ ండటంతోనే అక్షర్ పటేల్‌ను పక్కన పెట్టాల్సి వచ్చిందని చెప్పుకొచ్చాడు.

## పాక్ ప్రధాని ఇచ్చిన చెక్ బౌన్స్

పాకిస్థాన్ క్రికెట్లో చిత్రవిచిత్రమైన ఘటనలకు ఎలాంటి కొదవ ఉండదు. మైదానంలో ప్లేయర్ల ఆటతీరు కంటే మైదానం బయట వారు చేసే కామెంట్స్.. అక్కడి పరిస్థితిలు తరచూ చర్చనీయాంశమవుతుంటాయి. తాజాగా పాకిస్థాన్ మాజీ స్పిన్నర్ సయీద్ అజ్మల్ తన దేశ ప్రభుత్వానికి సంబంధించి ఓ షాకింగ్ విషయాన్ని వెల్లడించారు. ఏకంగా దేశ ప్రధాని ఇచ్చిన బహుమతి చెక్ బ్యాంకులో బౌన్స్ అయిందంటూ ఆయన చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పాకిస్థాన్ క్రికెట్ చరిత్రలో 2009 సంవత్సరం చాలా ప్రత్యేకమైనది. ఆ ఏడాది పాక్ జట్టు టీ20 ప్రపంచ కప్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయం తర్వాత దేశవ్యాప్తంగా సంబరాలు జరిగాయి. అప్పటి పాకిస్థాన్ ప్రధాని యూసుఫ్ రజా గిలానీ ప్లేయర్లను సత్కరించడానికి తన నివాసానికి ఆహ్వానించారు. జట్టులోని ప్రతి క్రీడాకారుడికి ప్రోత్సాహకంగా 25 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ చేదు అనుభవాన్ని సయీద్ అజ్మల్ గుర్తు చేసుకున్నారు. "ప్రధాని మాకు రూ.25 లక్షల చెక్ ఇచ్చినప్పుడు మేము చాలా సంతోషించాం. ఆ రోజుల్లో అది చాలా పెద్ద మొత్తం. కానీ ఆ చెక్కును మార్చుకోవడానికి మేము బ్యాంకుకు వెళ్లినప్పుడు మాకు పెద్ద షాక్ తగిలింది. ప్రభుత్వం ఇచ్చిన ఆ చెక్ బౌన్స్ అయింది" అని సయీద్ అజ్మల్ నవ్వుతూనే ఆవేదన వ్యక్తం చేశారు.

# మలుపు తిప్పిన విల్ జాక్స్

### ఓడిపోయే మ్యాచ్‌లో గెలిచిన ఇంగ్లండ్!




ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 సూపర్-8 దశలో ఇంగ్లండ్ శుభారంభం చేసింది. ఆదివారం పల్లెకెలె వేదికగా జరిగిన సూపర్-8 పోరులో సమష్టిగా రాణించిన ఇంగ్లండ్ 51 పరుగుల తేడాతో శ్రీలంకను చిత్తుగా ఓడించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ విల్ జాక్స్(21, 3/22) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఇంగ్లండ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 146 పరుగులే చేసింది. ఫిల్ సాల్ట్(40 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 62) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. చివర్లో విల్ జాక్స్(14 బంతుల్లో 4 ఫోర్లతో 21) విలువైన పరుగులు జోడించడంతో ఇంగ్లండ్ పోరాడే లక్ష్యాన్ని అందుకుంది. ఇంగ్లండ్ బ్యాటింగ్‌లో ఏ జోడీ కూడా కనీసం 30 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేయలేదు. స్లో వికెట్‌పై పరుగులు చేసేందుకు ఇంగ్లండ్ బ్యాటర్లు తడబడ్డారు. శ్రీలంక బౌలర్లలో దునిత్ వెల్లలేగ(3/26) మూడు వికెట్లు తీయగా.. దిల్షాన్ మధుషంక(2/25), మహీష్ తీక్షణ(2/21) రెండేసి వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించారు. దుష్మంత్ చమీరాకు ఒక వికెట్ దక్కింది. 147 పరుగుల లక్ష్యాన్ని శ్రీలంక ఈజీగా ఛేదిస్తుందని, ఇంగ్లండ్‌కు ఘోర ఓటమి తప్పదని అంతా అనుకున్నారు. కానీ విల్ జాక్స్(3/22) మూడు వికెట్లతో విజృంభించడంతో శ్రీలంక 16.4 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. కెప్టెన్ దసన్ షనక(24 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 30) ఒక్కడే రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. పవర్ ప్లేలోనే శ్రీలంక 34/5 ఐదు వికెట్లు కోల్పోయింది. జోఫ్రా ఆర్చర్(2/20), లియామ్ డాసన్(2/27), ఆదిల్ రషీద్(2/13) రెండేసి వికెట్లు తీసాడు. జేమీ ఓవర్టన్(1/13) ఒక వికెట్ దక్కింది. ఇంగ్లండ్ ఓపెనర్ ఫిల్ సాల్ట్ హాఫ్ సెంచరీతో పాటు విల్ జాక్స్ ఆల్‌రౌండ్ షో ఇంగ్లండ్ విజయానికి కలిసొచ్చింది.

# కొడుక్కి హార్దిక్ 4 కోట్ల గిఫ్ట్




హార్దిక్ పాండ్యా తన కొడుకు అగస్త్యకు అత్యంత ఖరీదైన ల్యాండ్ రోవర్ డిఫెండర్ కారును కానుకగా ఇచ్చాడు. హార్దిక్ కుమారుడు అగస్త్య నందా- మాజీ భార్య నటాషా స్టాంకోవిక్ ఈ కారునుని ఎంతో అబ్బురపడుతూ అందుకున్నారు. నటాషాకు విడాకులు ఇచ్చి ఆమెకు దూరమైన తర్వాత కూడా తన కొడుకు కోసం హార్దిక్ పాండ్యా.. ఆమెతో సన్నిహితంగానే ఉ ంటున్నాడు. విడాకుల సమయంలోనే ఈ జోడీ ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. భార్యాభర్తలుగా విడిపోయినా.. అగస్త్య తల్లిదండ్రులుగా అతనికి ఎలాంటి లోటు రాకుండా చూసుకుంటామని పేర్కొంది. ఈ క్రమంలోనే తన కొడుకు కోసం హార్దిక్ పాండ్యా రూ.4 కోట్ల విలువైన ల్యాండ్ రోవర్ డిఫెండర్ అనే లగ్జరీ కారును బహుమతిగా అందించాడు. ముంబైకి చేందిన ఒక ప్రముఖ కార్ డీలర్‌షిప్ సంస్థ ఈ కారు బహుమతి కార్యక్రమం యొక్క ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకోవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఫొటోల్లో నటాషా స్టాంకో విచ్‌తో పాటు కుమారుడు అగస్త్య ఉన్నాడు. బ్లాక్ కలర్ ల్యాండ్ రోవర్ కారుతో ఈ ఇద్దరు ఫొటోలకు ఫోజిచ్చారు. ఈ ఫొటోలో పప్పా గిఫ్ట్ అనే బోర్డు కనిపించింది.

ఈవార్తలు ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
సోమవారం 23-2-2026



# రాయల వారి కిష్కింధ

**సుగ్రీవుడికీ, కృష్ణదేవరాయలకూ లింకేమిటి?**
**రాయల రాజ్యానికి, కిష్కింధకు ఉన్న సంబంధం ఏమిటి?**
**రాయల రాజ్యాన్ని స్థాపించింది వాలి సుగ్రీవులేనా?**
**రాముడికి సాయం చేసింది ఆంధ్రులేనా?**

శ్రీకృష్ణదేవరాయలు.. సాహితీ సమరాంగణ సార్వభౌముడు... విజయనగర సామ్రాజ్య కీర్తి పతాక. రాయల వారికీ, వానరులకూ ఓ లింక్ ఉంది తెలుసా? రామాయణ కాలం నాటి సుగ్రీవుడికీ, కృష్ణదేవరాయలకూ మధ్య విడదీయరాని ఓ అనుబంధం ఉంది. వేల సంవత్సరాల క్రితం నాటి రామాయణ కాలంలోని కిష్కింధ ఎక్కడ? 16శతాబ్దం నాటి విజయనగర సామాజ్యం ఎక్కడ? ఈ రెంటికీ పొంతన ఎలా కుదురుతుంది? అనుకోవచ్చు. సహజమే. కిష్కింధను ఏలింది వానరులు.. విజయనగరాన్ని పరిపాలించింది నరచక్రవర్తులు. కానీ, చరిత్ర మరువని సంబంధం విజయనగర మూలాల్లో దాగి ఉంది.

రాయల వారి రాజ్యానికీ, వానర సామ్రాజ్యానికీ తల్లివేరు ఒకటే. అంతే కాదు... వాలి, సుగ్రీవులు వానర రాజులు కిష్కింధ సామ్రాజ్యాధినేతలు. రాముడికి బలం వానరులు. రావణ సంహార సారధికి వారివే అండదండలు. సీతమ్మ జాడను కనుగొన్నది వారు. వారధి కట్టి లంకకు చేటు తెచ్చిందీ వారు. ఇంతకీ ఈ వానరులు ఎవరు? ఎక్కడి వారు? ఆంధ్రులేనా? రాముడికి సాయం చేసింది తెలుగువారేనా? ఒకటి రాయలవారి సామ్రాజ్యపు మూలం కిష్కింధలో ఉందనేది.. రెండు వానరులు ఆంధ్రులేనన్నది. ఈ రెంటికీ లంకె ఉంది. వానరులకూ, కృష్ణదేవరాయలకూ విడదీయరాని సంబంధం ఉంది. సుగ్రీవుడి నుంచి రాయలవారి దాకా రాచరికపు అనుబంధం కొనసాగింది. త్రేతాయుగంలో వానరులు, కలియుగంలో కృష్ణరాయలు ఇద్దరి మధ్యా ఎలా లంకె పడింది అనుకోవచ్చు. కానీ, విజయ నగర సామ్రాజ్యానికి కిష్కింధే మూలం. కిష్కింధకూ, రాయలకూ ముడిపెట్టడమేమిటి? దీని వెనుక లాజిక్కేమిటి? సహజంగానే వచ్చే ప్రశ్నే ఇది.. కానీ, ఇది నిజం.. కిష్కింధ నుంచి హంపి దాకా అవిచ్ఛిన్నంగా నాగరికతా ప్రస్థానం సాగింది. రాయలేలిన సీమకు, సుగ్రీవ రాజ్యానికి మూలాలు ఒకే చోట ఉన్నాయి. ఒకటిగా ఉన్నాయి. కోదండరాముడు విశ్రమించిన రుష్యమూకమే.. విజయనగరానికి కేంద్రస్థానంగా నిలిచింది. చరిత్ర మరచిన సత్యమిది.. రామాయణం నుంచి రాయల కాలం దాకా అవిచ్ఛిన్నంగా సాగిన జాతి మూలాలివి. రావణుడు సీతమ్మను ఎత్తుకెళ్లిన తరువాత ఆమె జాడను వెతుక్కుంటూ వెళ్లిన రామలక్ష్మణులను రుష్యమూకం వద్ద హనుమంతుడు కలిసాడు. అక్కడి నుంచి సుగ్రీవుడితో స్నేహం కుదిరింది.. అప్పటికే వాలిసుగ్రీవుల మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. వాలిని చెట్టుచాటు నుంచి సంహరించి సుగ్రీవుడికి పట్టం కట్టిన వాడు రాముడు. ఆ తరువాత వానర సేన కిష్కింధ నుంచి బయలుదేరి సీతాన్వేషణ చేపట్టింది. లంకలో సీతమ్మను కనుగొన్న తరువాత రాముడితో కలిసి వానరసేన లంకకు చేరుకుని మహారాక్షస సంహార కార్యక్రమాన్ని పూర్తి చేసింది. ఆ తరువాత తిరిగి కిష్కింధకు చేరుకుని రామరాజ్యంలో వానరులు గడిపారు. రామాయణంలో కిష్కింధకున్న ప్రాధాన్యం ఇది. అంతమాత్రం చేత విజయనగర సామ్రాజ్యానికి, కిష్కింధకూ సంబంధంలేదని అనుకోలేం. ఎందుకంటే 16వ శతాబ్దంలో రాయలేలిన రతనాలసీమే రామాయణ కాలం నాటి కిష్కింధ. విజయనగర సామ్రాజ్య వైభవాన్ని ఇవాళ చాటుతున్న హంపీయే నాటి కిష్కింధ సామ్రాజ్యానికీ రాజధాని, చిత్తూరు నుంచి బళ్లారి-హంపి దాకా విస్తరించిన సామ్రాజ్యం కిష్కింధ. వేల సంవత్సరాల తరువాత తెలుగుజాతి కీర్తిపతాకను విశ్వవ్యాప్తం చేసిన రాయల రాజ్యానికి మూల వ్యవస్థ.

కృష్ణదేవరాయల కాలంలో స్వర్ణయుగాన్ని అనుభవించిన ప్రాంతం అంతా నాటి కిష్కింధ సామ్రాజ్యంలో భాగమే. సాంకేతికంగా రుజువైన వాస్తవం. రామాయణ కాలం నాటి నుంచీ రాయలకాలం దాకా కూడా ఇది రక్షణాత్మకంగా, వ్యూహాత్మక స్థావరంగా కొనసాగింది. రాముడు రావణుడిపై ఇక్కడి నుంచే యుద్ధవ్యూహం రచించాడు. రాయల యుద్ధ పిపాస కూడా ఈ విజయనగరం కేంద్రంగానే సాగింది. విజయనగర శిథిలాలను మాత్రమే. కాదు, రామాయణ కాలం నాటి అనేక ఆనవాళ్లను మనం ఇక్కడ రుజువులతో సహా చూడవచ్చు. అయోధ్య నుంచి లంక దాకా రాముడు ప్రయాణం చేసిన ప్రాంతం అంతటా ఆయన గుర్తులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కిష్కింధ ఇందుకు ఉదాహరణ. నాడు దండకారణ్యంలో భాగంగా ఉన్న కిష్కింధ ఇవాల్టి దక్షిణ కన్నడ రాజ్యంలో హంపిగా కనిపిస్తోంది. ఈ రాజ్యాన్నే నాడు సుగ్రీవుడు ఏలుకున్నాడు. ఆ తరువాత ఇదే ప్రాంతంలో కాకతీయుల పతనానంతరం హరిహర రాయలు, బుక్కరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు. ఆ సామ్రాజ్యపు వారసుడే రాయలు. వాలి.. సుగ్రీవుడి అన్న.. ఇద్దరూ మంచి సోదరులే. ఓ రోజు వాలితో యుద్ధానికి దుందుభి అనే రాక్షసుడు అర్ధరాత్రి వస్తాడు.. అతణ్ణి తరుముతూ వెళ్లిన వాలి ఓ గుహలోకి వెళ్తాడు.. దాదాపు సంవత్సరం పాటు గుహలో యుద్ధం జరిగింది. ఇది రామాయణంలో జరిగిన కథ.. ఈ గుహను మనం ఇవాళికీ చూడవచ్చు. ఈ గుహలో ఒక శివలింగం కూడా కనిపిస్తుంది. ఈ శివలింగాన్ని అంతకు ముందు భస్మాసురుడు ప్రతిష్ఠించినట్లు మరో కథ ప్రచారంలో ఉంది. ఏడాదైనా అన్న తిరిగి రాలేదనుకున్న సుగ్రీవుడు పట్టాభిషేకం చేసుకున్నాడు. అదే సమయానికి తిరిగి వచ్చిన వాలి అతణ్ణి తరిమేసేసరికి రుష్యమూక పర్వతంపైకి వెళ్లి దాక్కున్నాడు. ఆ రుష్యమూకం పంపాసరోవర తీరంలో ఉంది. ఈ సరోవరం వద్దే సీతమ్మవారి నగలు ఆంజనేయుడికి లభించాయి. రుష్యమూకానికి సమీపంలోనే అంజనగిరి కూడా ఉంది.. కిష్కింధలో ఆంజనేయుడి నివాసమిది. తుంగభద్రానదికి ఉత్తర తీరంలోనే ఈ పర్వతం ఉంది. ఈ పర్వతంపై హనుమంతుడి గుడి కూడా ఉన్నది. అంజనగిరికి మరోవైపు మాల్యవంత పర్వతం ఉంది. సుగ్రీవుడితో స్నేహం తరువాత సీత జాడ తెలిసేంతవరకూ ఆయన ఈ పర్వతంపైనే ఉన్నాడు.. ఇప్పుడీ హిల్పైన అత్యద్భుతమైన రఘునాథ రాముడి దేవాలయం కనిపిస్తుంది. కిష్కింధలో రాముడు వాలిని చంపిన ప్రదేశాన్ని కూడా మనం చూడవచ్చు. రుష్యమూ కానికి కొద్ది దూరంలోనే నింబాపురం అనే గ్రామం ఉంది. ఈ గ్రామంలోనే వాలిని రాముడు సంహరించాడు. దీని ఆనవాళ్లు కూడా మనకు ఇక్కడ కనిపిస్తాయి. ఈ గ్రామంలోని కొండపై



రామచంద్రుడి పాదాలు వున్నాయి. ఈ పర్వతం చూడటానికి చాలా టిపికల్గా కనిపిస్తుంది. ఇక్కడే వాలి సుగ్రీవుల మధ్య యుద్ధం జరిగింది. ఇక్కడే చెట్టు చాటు నుంచి వాలిని రాముడు చంపాడని స్థానికుల విశ్వాసం. రామాయణ కాలం తరువాత హంపిలో మొట్టమొదటి ప్రాచీన ఆనవాళ్లు ఫస్ట్ సెంచరీకి ముందు మనకు కనిపిస్తాయి. ఇళ్లుడ పురావస్తు శాఖ జరిపిన తవ్వకాలో వేల సంవత్సరాల నాటి శిథిలాలు చాలా వెలుగు చూశాయి. చిత్తూరు నుంచి హంపి వరకు వానర సామ్రాజ్యం విస్తరించిన గుర్తులు మనకు కనిపిస్తున్నాయి. తిరుమల ఏడు కొండల్లో అంజనాద్రి పర్వతం హనుమంతుడి జన్మస్థలంగా భావిస్తున్నారు. అక్కడి నుంచి వానరజాతి కిష్కింధ దాకా విస్తరించిందని ఒక అభిప్రాయం. సీతను వెతకటానికి ఒక వానర బృందాన్ని తూర్పు వైపు పంపించాడు సుగ్రీవుడు. తూర్పున చివరంటా వెతికి రావాలని ఆదేశించాడు. హంపి సమీపంలోని కిష్కింధలో ఉన్న ఉదయ పర్వతంపై బంగారు రంగులో మూడు కొమ్మలున్న తాళ వృక్షాన్ని చూసినట్టుగా శిల్పం కనిపిస్తుంది. దక్షిణ అమెరికాలోని పిస్కో తీరంలోని అండెస్ పర్వతంపై ఇలాంటి వృక్షం బయట పడటం రామాయణపు చరిత్రను నిరూపిస్తున్నది.

ఇది 820 అడుగుల ఎత్తులో ఉంది. వానరులు దక్షిణ భారతంలో నివసించిన ఒక ట్రైబల్ జాతి. అంతా అనుకుంటున్నట్లు వానరులు అంటే కోతులు ఎంతమాత్రం కాదు. వీళ్లు మనుషులే.. కాకపోతే వీరికి తోక ఒకటి ఉండేదని అందువల్లే వీళ్లను 'వా'నరులని పిలిచేవారంటారు. దక్షిణాపథాన వీళ్లది ప్రధాన రాజ్యం. త్రేతాయుగం నుంచి ద్వాపర యుగం దాకా కొనసాగిన సుదీర్ఘ రాజ్య వ్యవస్థ కిష్కింధ మాత్రమే. మహాభారత కాలంలో పాండవుల్లో చివరివాడైన సహదేవుడు కిష్కింధకు వచ్చి వెళ్లాడు. అదే సమయంలో దండకారణ్యంలో రెండు రాజ్యాలుగా ఉన్న ఆంధక, తెలింగలను జయించాడు. కిష్కింధ ఒక బలమైన రాచరిక వ్యవస్థకు పునాది కనుకనే మన కాలంలో దానికి పునర్వైభవం కలిగింది. ఆనాటి స్వర్ణయుగాన్ని దాదాపు మూడు వందల సంవత్సరాల పాటు విజయనగర సామ్రాజ్యలక్ష్మి తిరిగి అందించింది. కృష్ణదేవరాయల కాలం రత్నాలు రాసులుగా పోసి వీధుల్లో అమ్మిన మహాయుగం. నాటి కిష్కింధే.. రాయల విజయనగరం.. మనకు హంపి. ఇవాల్టి కన్నడ రాజ్యంలో ఉన్న నాటి మన తెలుగు నగరి బళ్లారీ... కిష్కింధ నుంచి హంపి దాకా సాగిన భారత జాతి నాగరికతా ప్రస్థానం ఇది. మన జాతి మూలాలను పదిలపరచుకున్న పవిత్ర ప్రాంతం కిష్కింధ.



**కోవెల సంతోష్ కుమార్**
రచయిత, 9052116463

సుగ్రీవుడి నుంచి కృష్ణరాయల దాకా అపూర్వమైన చారిత్రక వైభవాన్ని తెలుగువారికి అందించిన నగరం హంపి.. మన మౌలిక మూలాలలో బలమైన మూలం కిష్కింధ.. దక్షిణాపథాన అసమాన సామ్రాజ్య వైభవ చిహ్నం కిష్కింధ. దానికి మరోపేరే విజయనగరం.. ఇంకోపేరు హంపి.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.